బక్రీద్ పండుగ జోరుగా జీవాల విక్రయాలు

- త్యాగానికి ప్రతీకగా 'ఖుర్బానీ' - పెరిగిన మేకల, గొర్రెల ధరలు

- బల్దియా భారీ ఏర్పాట్లు - నకిలీ చెల్లింపులతో మోసాలు

పాతబస్తీలో కొనసాగుతున్న మేకల, గొర్రెల విక్రయాలు

చాంద్రాయణగుట్ట, మే 26, ప్రభాతవార్త : ముస్లీం సోదరులు అత్యంత పవిత్రంగా, సాంప్రదాయబద్ధంగా జరుపుకునే బక్రీద్ (ఈద్–ఉల్–అదా) పండుగకు పాతబస్తీ సిద్ధమవుతుంది. బక్రీద్ త్యాగం, ధాతృత్వం, కరుణలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈనెల 28 జరుపుకునే ఈద్–ఉల్–అదా రోజున ముస్లీంలు కొత్త దుస్తులు ధరించి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి మసీదులు, నిర్ధేశిత ప్రార్థనా స్థలాలలో ఈద్ ప్రార్థనలు చేస్తారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. త్యాగానికి గుర్తుగా మేకలను, గొర్రెలను ఖుర్బానీ (బలి) ఇస్తారు. తమ శక్తికొద్ది జీవాన్ని బలి ఇస్తుంటారు. మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం కుటుంబ కోసం, మరో భాగాన్ని స్నేహితులు, ఇరుగు పొరుగు, బంధువుల కోసం మిగిలిన దానిని పేదలకు దానం చేస్తారు. ఈ పండుగను రెండు, మూడు రోజులు జరుపుకుంటారు.

జోరుగా జీవాల విక్రయం...

త్యాగానికి గుర్తుగా మేకలను, గొర్రెలను ఖుర్బానీ ఇవ్వటం సాంప్రదాయం కావటంతో ముస్లీంలు పెద్ద సంఖ్యలో జీవాలను ముందస్తుగానే కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాతబస్తీ వ్యాప్తంగా ప్రధాన రోడ్లు, కూడళ్లు, బస్తీలలో మేకల, గొర్రెల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రత్యేక గుడారాలు, షామియానాలు వేసి వ్యాపారులు వ్యాపారం నిర్వహిస్తున్నారు. బార్కాస్, చాంద్రాయణగుట్ట, అషమాబాద్, బండ్లగూడ, డీఎల్ఆర్ఎల్, పూల్‌బాగ్, బాబానగర్, డీఆర్‌డీఎల్, ఫలక్‌నుమా, ఇంజన్‌బౌలి, వట్టేపల్లి, నర్కిపూల్‌బాగ్, కిషన్‌బాగ్, బహదూర్‌పురా, ఖిల్వత్, శాలిబండ, జూపార్క్, పురానాపూల్, మీరాలంమండి, దారుల్‌షిఫా, డబీర్‌పురా, చంచల్‌గూడ, సైదాబాద్ తదితర ప్రాంతాలలో పెద్ద సంఖ్యల జీవాలను విక్రయిస్తున్నారు. వ్యా పారులు, బక్రీద్ కోసం ప్రత్యేకంగా జీవాలను పెంచే వారు పెద్ద సంఖ్యలో మేకలను, గొర్రెలను వాహనాలలో నగరానికి తరలిస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో జీవాలు కొనుగోలు, విక్రయాలతో సందడిగా కనిపిస్తున్నాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే జీవాల ధరలు బాగా పెరిగాయి. దీనికి పెరుగుతున్న పెట్రోలు ఉత్పత్తుల ధరలు ఇతరత్ర తోడైయ్యాయి. వ్యాపారులు జీవాలను జోడీల చొప్పన విక్రయిస్తున్నారు. కాస్త బలంగా ఉన్నవాటి ధరలు చుక్కలను చూపుతున్నాయి. ప్రత్యేకంగా కొమ్ములు దేలిన మేక, గొర్రె పొటేళ్ళ ధరలు వేలల్లో పలుకుతున్నాయి. తెలంగాణలోని పెబ్బేరు, నల్లగొండ, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, షాద్‌నగర్, తక్కుగూడ, కందుకూర్ ప్రాంతాల జీవాలతోపాటు పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుండి తరలిస్తున్నారు. కశ్మీర్ జీవాలకు భళే గిరాకీ ఏర్పడింది. ఇక సైజు, జోడీలను బట్టి ధరలను నిర్ణయిస్తున్నారు. పది కిలోల వరకు తూగే మేక, గొర్రెలను పది వేల రూపాయల వరకు, పొటేళ్లు మరింత ప్రియంగా ఉన్నాయి. ప్రత్యేకంగా పెంచిన జీవాల ధరలు వేలల్లో పలుకుతున్నాయి. అయితే తెలంగాణ జీవాలకు బాగా డిమాండ్ ఏర్పడింది. వీటి మాంసం రుచికరంగా, తేలికగా ఉడుకుతుండటంతో మంచి గిరాకీ లభిస్తుంది. పండుగ మరో రెండు రోజులు మిగిలి ఉండటంతో జీవాలకు మరింత ధర పలికే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే కొందరు మోసగాళ్లు ఇదే అదనుగా నకిలీ యాప్‌లతో డిజిటల్ చెల్లింపులు చేస్తూ నకిలీ స్క్రీన్‌షాట్లు చూపి వ్యాపారులను మోసం చేస్తున్నారు.

బక్రీద్‌కు బల్దియా ప్రత్యేక ఏర్పాట్లు ....

ఈద్ ఉల్ అదా (బక్రీద్) పండుగకు బల్దియా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. చార్మినార్ జోన్ పరిధిలోని మలక్‌పేట్, సంతోష్‌నగర్, యాకుత్‌పురా, చార్మినార్, మూసారాంబాగ్ సర్కిళ్ళలో పారిశుధ్య నిర్వాహణ కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, సాలిడ్ వేస్ట్ మెటీరియల్ (ఎస్‌డబ్ల్యూఎం) డిఈలు, సూపర్‌వైజర్లు, జవాన్లు నిరంతరం విధులు నిర్వహించనున్నారు. జంతు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించేందుకు 10 టన్నుల సామర్థ్యం కలిగిన భారీ వాహనాలు 46, మినీ టిప్పర్లు 62, జెసిబిలు 32, బాబ్‌కాట్‌లు 5ను సిద్ధం చేశారు. అదేవిధంగా వ్యర్థాలను సేకరించేందుకు మసీదుల వద్ద గార్బేజ్ కవర్లను పంపిణీ చేస్తున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు సహకరించనున్నారు. రాజేంద్రనగర్ జోన్‌లోని జంగమ్మెట్, చాంద్రాయణగుట్ట సర్కిళ్లలో పారిశుధ్య నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.



హైదరాబాద్ వార్త

మేమింతే.. మారమంతే !

-పని కావాలంటే..
చేయి తడపాల్సిందే
-ఇదీ ప్రభుత్వకార్యాయాల్లో
అధికారులు సిబ్బంది తీరు
-ఎసిబి దాడుల్లో వెలుగులోకి
అవినీతి జలగలు

హైదరాబాద్, మే 26,ప్రభాతవార్త: లబ్దిదారులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం, ఇతర ప్రయోజనాలు ఏవైనా ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు ఇవ్వందే దస్త్రం కదలని పరిస్థితి నెలకొంది. చేయి తడిపితేకానీ అధికారులు పనులు చేయడం లేదనే విమర్శలు బహిరంగానే వినిపిస్తున్నాయి. ఆస్తి బదలాయింపు, నల్లాకనెక్షన్, పవర్ కనెక్షన్, పెన్షన్ పథకాలు వర్తించాలన్నా విచారణధికారులు చేతులు తపడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. తాజాగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలకు మరో భారీ తిమింగలం చిక్కింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట్ ఎమ్మార్వో ఆఫీసులో ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ.. ఎమ్మార్వో సుచరిత ఆఫీసులో సోదాలు చేపట్టింది. ఈ క్రమంలో బాధితుడి నుంచి ఆమె కారు డ్రైవర్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని, వాటిని సుచరితకు అందిస్తుండగా ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన దాదాపు రూ. 30 లక్షల భారీ లావాదేవీలకు సంబంధించిన కేసులో ఈ దాడులు నిర్వహించారు. ఎమ్మార్వో సుచరితతో పాటు ఆమె కారు డ్రైవర్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ దాడులు నిరర్వహించారు. సోదాల అనంతరం మీడియా సమావేశంలో డీఎస్పీ ఆనంద్ కుమార్ వివరాలను వెల్లడించారు. శామీర్‌పేట మండలం ఆలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టామని, ఎకరానికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమికంగా తేలిందని తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ సుచరిత.. డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్నామని అన్నారు. ఎమ్మార్వో ఆఫీసులో కీలక పత్రాలు, భూకన్వర్షన్‌కు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా, రెండేళ్ల కిందట కూడా శామీ ర్‌పేట ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి పట్టుబ డిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తా జాగా మరోసారి అదే ఎమ్మార్వో ఆఫీసులో ఏసీబీ దాడులు జరగడం చర్చనీయాంశంగా మారింది.

అన్నిశాఖల్లోనూ అదేతీరు..

ఇలా నిత్యం వివిధ ప్రభుత్వశాఖల్లో అవినీతి జలగలు బయపటడుతూనే ఉన్నాయి. జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్ట్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ ,రిజిస్ట్రేషన్ ఇలా అనేకశాఖల్లో అవినీతి తాండవిస్తోంది. తమపనులు చేసిపెట్టాలని వెళ్లిన లబ్దిదారులు డబ్బులు ఇవ్వకుంటే సదరు దస్త్రంలో లేనిపోని కారణాలు చూపిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పెండింగ్‌లో పెట్టడం సర్వసాధారణంగా మారింది. పనులకోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయిన లబ్దిదారులు రాజీపడి విధిలేని పరిస్థితుల్లో ఎంతో కొంత ముట్టచెప్పి వారిపనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేయి తడిపితే మాత్రం అవసరమై ధ్రువ పత్రాలు ఉన్నా లేకున్నా పనులు చకచకా చేసిపెడుతున్నారు. లంచావతారుల బెడద తప్పించడానికి ప్రభుత్వం పలురకాల ప్రయోజనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనలు ప్రవేశపెట్టింది. అయితే ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునప్పటికీ సంబంధిత విచారణాధికారిని కలువకపోతే ఆశించిన ప్రయోజనం అందుబాటులోకి రాకుండా పోతుంది. సదరు అధికారిని కలిసి ఎంతో కొంత ముట్టచెబితేనే సకాలంలో పనులయ్యేలా చూస్తున్నారు. వేలకు వేల రూపాయలు వేతనాలు రూపంలో పొందుతున్న అధికారుల దిగజారుడుతనం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

కేసుల అంతంతమాత్రమే..

అవినీతి నిరోధక శాఖ (ఏసీబి) రెండు రకాల కేసులు నమోదు చేస్తుంది. అధికారులు ఎవరైనా పనులు చేయటానికి లంచాలు అడుగుతున్నట్లు బాధితులు ఫిర్యాదు చేస్తే డబ్బులు అందించేటప్పుడు వలపన్ని అధికారులను పట్టుకుంటారు. రెండోది..ఆదాయానికి మించి ఆస్తులున్న వ్యాపారులు,అధికారులను సైతం,ఇళ్ల,వారి వ్యాపార కేంద్రాలపై దాడులు చేసి పట్టుకుంటారు. అయితే బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు అక్కడక్కడ లంచావతారులను పట్టుకుంటున్న అధికారులు ఆదాయానికి మించి ఆస్తులున్నవారిపై దృష్టి సారించడం లేదు. ఇలాంటి వారిపై రహస్యంగా విచారణ జరిపి పట్టుకోవాల్సి ఉండగా ఇలాంటి కేసుల విషయంలో ఆసక్తి కనబరచడం లేదు. ప్రలు ప్రభుత్వ శాఖల్లో లంచాలు పెరుగుతున్నా కేసులు మాత్రం పెరగటం లేదు. ఏసీబికి దొరికిన అధికారులు ఏదో ఒక రాజకీయ నాయకుడి అండతో కొంతకాలం పాటు దూరప్రాంతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మళ్ళీ పాతపాటే పాడుతున్నారు. కారణం అవినీతి నిరోదక శాఖ గురించి ప్ర జల్లో అవగాహన లేకపోవడమేనని తెలుస్తుంది. దీంతో ప్రతి ఏడాది కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఏదోలా మనపని అయిపోయిందనే ధోరని కారణం వల్ల పలువురు ఫిర్యాదులు చేయ దానికి ఆసక్తి కనబరచడం లేదు. ఈవిషయంలో ఉన్నతాధికారులు ప్రజల్లో అవగాహన కల్పిం చాల్సి అవసరం ఉంది.

ఐక్యపోరాటం కోసం సిద్దంకండి : ఎంపి ఈటల రాజేందర్

జలవిహార్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటెల రాజేందర్.

బేగంపేట మే 26,ప్రభాతవార్త : ముదిరాజ్‌లకు అధికారంపై మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేసారు. తెలంగాణాలో అతిపెద్ద కులం ముదిరాజ్ అని రాష్ట్రంలో ముదిరాజ్ జనాభా 7.46శాతంగా ఉందన్నారు. 35నియోజకవర్గాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్నప్పటికీ రాజకీయంగా ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యత లేదని, ఇలా ఎందుకు జరుగుతుందో అంతా ఆలోచించుకోవాలన్నారు. మంగళవారం ముదిరాజ్ విద్యావంతుల వేదిక ముదిరాజ్ సింహావలోకనం ఆధ్వర్యంలో జలవిహార్ లో (రాష్ట్ర స్థాయి సమాలోచన సదస్సు)జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ దినేష్, డాక్టర్ శివకేశవ్, ఉప్పరి నారాయణ, జగన్ ముదిరాజ్, ముదిరాజ్ విద్యార్థుల వేదిక కన్వీనర్ జూలు నాగేశ్వర్ ముదిరాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ కు మార్చాలని ప్రధాన డిమాండ్‌తో జలవిహార్‌లో జరిగిన ఈ సమావేశంలో పలు ముదిరాజ్ సంఘాల నాయకులు, విద్యావంతులు, మేధావులు పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సరేంద ప్రకారమే ముదిరాజ్ లు అన్ని రంగాల్లో వెనుక బడి ఉన్నారని తేల్చిందని నిర్వహకులు అభిప్రాయపడ్డారు. పార్టీలు ఏవైనా జాతికి ఎప్పుడూ అండగా ఉంటామని, సీరియస్‌గా పోరాటం చేస్తే ఖచ్చితంగా అధికారం దక్కుతుందన్నారు. ఐక్య పోరాటం కోసం సిద్దం కావాలని, మన డిమాండ్స్ ఎందుకు నెరవేరవో చూద్దామని పిలుపు నిచ్చారు. ఒకటే సంఘంగా ఉండాలి అనేది మొదటి నుంచి తన విజ్ఞప్తి అన్నారు. ఎన్నో ఏళ్లుగా హక్కుల కోసం కొట్లాడుతున్నప్పటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. రోషంలో సాహసంలో కొదవలేదు కానీ మనం ఎక్కడ ఉన్నాము పునరాలోచన చేసుకోవాలన్నారు. బీసీ డి నుంచి బీసీ ఏకి మార్చాలని మొదటి సారి అసెంబ్లీలో మాట్లాడింది నేనేనని ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు అనేక సార్లు అసెంబ్లీలో ప్రస్తావించానన్నారు. 2008లో ఉప ఎన్నికల సందర్భంగా రాజశేఖరరెడ్డి ఉత్తర్వులు కూడా జారీ చేసారు. కానీ అందినట్టే అంది దూరమైందన్నారు. మాది మాకు కావాలని మాత్రమే అడుగుతున్నామని ఈ జాతి అనేక సంవత్సరాలుగా ఆక్రోసిస్తుందన్నారు. 26లక్షల జనాభా ముదిరాజ్ 7.46శాతం ఉందన్నారు.

మంచి నీళ్లను వృధా చేస్తే పెనాల్టీలు

-రూ.7వేల కోట్లతో గోదావరి ఫేజ్ 2,3
-భవిష్యత్‌లో కృష్ణా ఫేజ్ 4, 5 తీసుకువస్తాం
-ఉద్యమంలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి అజారుద్దీన్, జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో కలిసి తాగునీటిపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, మే 26 ప్రభాతవార్త

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి ఫేజ్ 2, 3 తీసుకువస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంచినీళ్లను మిస్ యూజ్ చేస్తే పెనాల్టీలు వేస్తామన్నారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ మంత్రి అజరుద్దీన్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెట్రో వాటర్ వర్క్ ఎండీ అశోక్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు డైరెక్టర్ సుదర్శన్ , జేఎండీ మయాంక్ మిట్టల్ , వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం నగరానికి 650 ఎంజిడి నీళ్ల సప్లై నగరానికి అవుతుందన్నారు. 7వేల కోట్లతో గోదావరి ఫేజ్–2, ఫేజ్–3 పనులు జరుగుతున్నాయని చెప్పారు. "2014 నుంచి 2024 వరకు గత ప్రభుత్వం నగర భవిష్యత్ నీటిపై ఎలాంటి ప్లాన్ చేయలేదు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి ఫేజ్ 2, 3 తీసుకువస్తుంది. భవిష్యత్‌లో కృష్ణా ఫేజ్ 4,5 రాబోతుంది. నగరంలో 14 లక్షల 50వేల ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయి. 6 లక్షల 23 వేలు ఉచిత కనెక్షన్లు ఉన్నాయి. డ్రింకింగ్ వాటర్ సమస్యలను, ఫిర్యాదులను ఎప్పటికపుడు పరిష్కరిస్తున్నాం. 6 లక్షల 14 వేల మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. ఏప్రిల్, మే నెలల్లో మ్యాన్ హోల్స్ మొత్తం క్లియర్ చేస్తున్నాం. గతేడాది హయ్యెస్ట్ రెయిన్ పడింది. సమ్మర్‌లో ట్యాంకర్ సప్లై బాగా జరుగుతుంది. 95 శాతం ట్యాంకర్లు బుకింగ్ అయిన 24 గంటల్లోనే డెలివరీ అవుతుంది. ప్రజలంతా వీలు ఉన్న చోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంకుడు గుంతల కోసం ఈసారి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం. గ్రౌండ్ వాటర్‌ను పెంచకపోతే ఫ్యూచర్‌లో చాలా ఇబ్బందులు వస్తాయి. వర్షపు నీటిని ఒడిసి పట్టకపోతే కష్టమే. ప్రజల సహకారం కావాలి. ఉద్యమంలాగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. వాటర్ హార్వెస్టింగ్ పిట్స్ ఏర్పాటు చేసేవారిని ఎంకరేజ్ చేస్తాం. వాటర్ హార్వెస్టింగ్ చేయకుండా...అదే ప్రాంతం నుంచి ట్యాంకర్లు బుక్ చేసుకుంటాం. అంటే అప్పుడు డబుల్ రేట్ వేస్తాం. 11 వేల 900 కోట్లు జలమండలి అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల కోసం కేటాయించాం. జలమండలిలో ఉద్యోగుల ఖాళీలను కూడా త్వరలో నియమిస్తాం. డ్రైనేజ్ లైన్స్‌పై అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం" అన్నారు. కేటీఆర్ మళ్ళీ మేము వస్తే 24 గంటలు నీళ్ళు ఇస్తామని రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. బస్తీలకు ప్రయారిటీగా నీటి సప్లై చేస్తున్నామని, ఉద్దేశపూర్వకంగా నీళ్ల రావట్లేదని జలమండలి దగ్గర ప్రతిపక్షాలు ధర్నాలు చేస్తున్నారని చెప్పారు. విపక్షంలో ఉన్నపుడు నేను కూడా రాజకీయాలు చేశాను కానీ, నీటి మీద రాజకీయాలు చేయవద్దన్నారు. మంచినీటిను మిస్ యూజ్ చేస్తే పెనాల్టీలు వేస్తామన్నారు. కొన్ని ప్రాంతాల్లో నీటి సామర్థం ఉందా లేదా అని చూడకుండానే భారీ భవనాలు, హై రైజ్డ్ బిల్డింగ్స్‌కి పర్మిషన్లు ఇచ్చారని, ఇకనుంచి అలాంటి హై రైజ్డ్ బిల్డింగ్స్‌కి పర్మిషన్లు ఇచ్చేముందు అన్ని పరిశీలిస్తామని చెప్పారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగరంలోని నీటి సమస్య, నదుల పరిరక్షణ, నీటి సరఫరా పలు అంశాలపై అధికారులు మంత్రి దృష్టి తీసుకొచ్చారు. నగరంలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ సేవలు, వర్షాకాల సన్నద్ధత, కొనసాగుతున్న మౌలిక వసతుల పనులు, ఎస్టీపీల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. రానున్న పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని నీటి పొదుపు చేపట్టాలని, గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పెంచేలా కృషి చేయాలని ప్రతి ఒక్కరు బాధ్యతతో పని చేయాలని మంత్రి సూచించారు,

చెరువుల ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం

- కోకాపేట కొత్తచెరువులో వెలిసిన ప్రహారీగోడ కూల్చివేత

కోకాపేట కొత్త చెరువులో వెలిసి అక్రమ ప్రహారీగోడను కూల్చి వేస్తున్న హైడ్రా అధికారుల దృశ్యం.

నార్సింగి, మే 26 ప్రభాతవార్త : గండిపేట మండల పరిధిలోని కోకాపేట కొత్త చెరువులో వెలిసి అక్రమ ప్రహారీగోడను మంగళవారం హైడ్రా, ఇరిగేషన్ అధికారులు జేసీబీలతో కూల్చివేశారు. చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసమే హైడ్రా పుట్టిందని, కబ్జాదారులు ఎంతటి వారైనా ఊరుకునేది లేదని, ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. చెరువుల పునరుద్దరణ, సుందరీకరణ కోసం హైడ్రా నిరంతరం పని చేస్తుందని స్పష్టం చేశారు. కోకాపేట కొత్త చెరువులో గోల్డ్‌ఫిష్ విల్లాస్ నిర్వాహకులు అక్రమంగా ప్రహారీగోడను నిర్మించారు. ఈ విషయంను తెలుసుకున్న హైడ్రాఅధికారులు ఎన్ని ఒత్తిడిలు వచ్చినా వెనుకంజ వేయకుండా సదరు ఆక్రమణలను కూల్చివేతలు చేశారు. భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరుగకుండా ఉండేందుకు చెరువు స్థలం చుట్టూ ఫెన్సింగ్ పనులను కూడా ప్రారంభించారు. హైడ్రా అధికారుల చర్యలను కోకాపేట ప్రాంత ప్రజలు అభినందిస్తున్నారు. అధికారులు నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారని, ఎవరి ఒత్తిడిలకు లొంగకుండా బడా రియల్ ఎస్టేట్ సంస్థ చేపట్టిన కబ్జాలను తొలగించారని పేర్కొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం, ఉయ్యాల సేవ

పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని ఊరేగిస్తున్న దృశ్యం

సెఫాబాద్, మే 26 ప్రభాతవార్త: లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్నపన తిరుమంజనం, ఊయ్యాల సేవ, తిరుచ్చి సేవా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వందలాది మంది భక్తుల సమక్షంలో ఉదయం పది గంటలకు స్నపన తిరుమంజనం జరగగా, సాయంత్రం 6 నుంచి 7 వరకు శ్రీవారికి ఊయ్యాల సేవ, రాత్రి 7.30 నుంచి 8.30 వరకు తిరుచ్చి సేవా కార్యక్రమాలు కన్నుల పండువగా అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని పల్లకిలో ఊరేగించారు. పల్లకిని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. భక్తులకు దేవాలయం సిబ్బంది తీర్థ ప్రసాదాల వితరణతోపాటు అన్న ప్రసాదంను అందజేశారు. బుధ, గురువారాల్లో కూడా స్నపన తిరుమంజనం, స్వామివారికి ఊయ్యాల సేవ, తిరుచ్చి సేవా కార్యక్రమాలు జరుగుతాయని టిటిడి ఓఎవొ యు.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం లోకల్ అడ్వైయిజరి కమిటి ఛైర్మన్ శంకర్‌గౌడ్, బాలాజీ భవన్ భక్తుల సొసైటి అధ్యక్షుడు రాజు, కార్యదర్శి వాసు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు టిటిడి అధికారులు శ్రీనివాస్ మణికంత, లక్ష్మీపతి, ఉద్యోగులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు సేవలు అందించారు.

సినీనటుడు చిరంజీవిపై తప్పుడు వీడియోలు..

- జూబ్లీహిల్స్ ఠాణాలో యూట్యూబ్ ఛానల్‌పై కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 26, ప్రభాతవార్తః ప్రముఖ సినీనటుడు చిరంజీవి గురించి తప్పుడు, మార్ఫింగ్ చేసిన వీడియోలు, అసత్య ప్రచారం చేశారనే ఆరోపణలపై ఒక యూట్యూబ్ ఛానెల్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. మూవీమైస్టేరీయూ7జెడ్ అనే యూట్యూబ్ చానెల్‌లో చిరంజీవిని తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, బట్టతల వచ్చిందని, వ్యాధి కారణంగా బరువు తగ్గిపోయినట్లు చూపిస్తూ మార్ఫింగ్ చేసిన చిత్రాలు, వీడియోలు ప్రచారం చేశారు. ఎలాంటి వైద్య, అధికారిక ధృవీకరణ లేకుండానే ఈ తప్పుడు సమాచారాన్ని కావాలనే ప్రజలను తప్పుదారి పట్టించే ఉద్దేశంతో ప్రచారం చేశారు. ఈ వీడియోల వల్ల అభిమానుల్లో ఆందోళన కలిగించడంతో పాటు నటుడి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని నగరానికి చెందిన న్యాయవాది రామకృష్ణ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు యూట్యూబ్ ఛానెల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఛానెల్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 352 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనాథలకు మంచు మనోజ్ సేవలు

సెలబ్రిటీతో పునర్జన్మ ఛాలెంజ్‌కు స్పందించిన సినీ నటుడు

మతిస్థిమితం లేని అభాగ్యునికి కటింగ్ చేస్తున్న సినీ హీరో మంచు మనోజ్

సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త: ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు కుమారుడు సినీ హీరో మంచు మనోజ్ మంగళవారం హైదరాబాద్ శివార్లలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథాశ్రమాన్ని సందర్శించారు. మతిస్థిమితం లేక దిక్కుతోచని స్థితిలో దీనావస్థలో రోడ్లపై తిరుగే అభాగ్యులను, అనాథలను ఆదరించి ఆశ్రయం కల్పిస్తున్న మాతృదేవోభవ వ్యవస్థాపకుడు గట్టు గిరి ఇటీవల సెలబ్రెటితో పునర్జన్మ ఛాలెంజ్ పిలుపుకు మంచు మనోజ్ స్పందించారు. ఈ నేపథ్యంలో ఛాలెంజ్‌ను స్వీకరించిన ఆయన మంగళవారం ఆశ్రమానికి విచ్చేసి మతిస్థిమితం లేని సంతోష్ అనే యువకుడికి పెరిగిన జుట్టును, గడ్డాన్ని తొలగించి స్నానం చేయించి దుస్తులు తొడిగి పునర్జన్మ కల్పించారు. మానవతా దృక్పథంతో ముందుకు వచ్చిన మనోజ్ ఆశ్రమానికి విచ్చేసి మతిస్థిమితం లేని అభాగ్యులకు సపర్యలు చేసి స్వయంగా వారికి భోజనం వడ్డించడంపై ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు గిరి మనోజ్‌ను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ సెలబ్రిటీతో పునర్జన్మ ఛాలెంజ్ పిలుపు ఆకట్టుకుందని అన్నారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొనడం సంతృప్తినిచ్చిందని వెల్లడించారు. అభాగ్యులను ఆదరిస్తున్న మాతృదేవోభవ ఆశ్రమానికి తోడ్పాటునందిస్తానని మనోజ్ హామీనిచ్చారు.

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

బోరింగ్‌ను ప్రారంభిస్తున్న డిసిసి ఉపాధ్యక్షులు చంద్రశేఖర్

చార్మినార్,మే 26 ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షులు తిరుపతి చంద్రశేఖర్ అన్నారు.శాలిబండ డివిజన్ పరిధిలోని అలియాబాద్,షంషేర్‌గంజ్ బస్తీలలో మరమ్మతులు జరిగిన మంచి నీటి బోరింగులను ఆయన ప్రారంభించారు.ఈఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్న దని తెలిపారు.మంచి నీటి బోరింగులకు మరమ్మతులు చేయటం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగం కలుగుతుందని ఆయన తెలియజేశారు.వాటర్ వర్క్స్ అధికారులకు చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలకు మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్వాన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు.

కార్వాన్,మే 26 ప్రభాతవార్త

కార్వాన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు వేసవి తాపాన్ని తగ్గించడానికి కార్వాన్ ప్రధాన రహదారిపై చల్లటి మజ్జిగ, మామిడిరసం,నిమ్మరసం పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భముగా ప్ర.కార్యదర్శి గోదా లక్ష్మీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత విపరీతంగా పెరిగిపోయిందని,ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 47 డిగ్రీలకుపై చేరుకుంటున్న తరుణంలో వేసవి తాపాన్ని తగ్గించడానికి చిరు ప్రయత్నమన్నారు.కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రా ము గులేకర్,కోశాధికారి పంబి శ్రీనివాస్,సభ్యులు రాజేష్ పాండ్యా,సన్నీ నుంజ,మహేష్,దత్త నాగేశ్,అద్దెట్ల ప్రేమ్ కుమార్ తదితర అసోసియేషన్ పాలకమండలి సభ్యులు పాల్గొని ప్రజలకు సేవలందించారు.

బాలల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులు చేసుకోవాలి

జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు

హైదరాబాద్, మే 26,ప్రభాతవార్త:

జిల్లాలో ప్రతిభావంతులైన 518 ఏళ్లోపు బాల బాలికలు "ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్"అవా ర్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, క్రీడలు, కళలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లో విశేష ప్రతిభ చాటిన బాల బాలికలు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు జులై 31 లోపు వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డీసీపీవో శ్రీనివాస్ 8499888255 ను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హెబ్రోన్ చర్చ్‌లో యౌవనస్థుల కూటములు ప్రారంభం

చిక్కడపల్లి మే 26 (ప్రభాతవార్త) : ప్రతిష్టాత్మక అఖిల భారత యౌవనస్థుల కూటముల కార్యక్రమం మంగళవారం గోల్కొండ చౌరస్తాలో బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన ప్రముఖ క్రై స్తవ కేంద్రమైన హెబ్రోన్ చర్చ్ లో ప్రారంబయినాయి . ప్రతి ఏడాది నిర్వహించే అఖిల భారత యౌవనస్థుల కూటములు 31 వరకు జరుగుతాయని హెబ్రోను సొసైటీ అధికార ప్రతినిధి ఆర్.వీరాచారి తెలిపారు. ఈ పదిహేనువేల మంది వరకు యువతీయువకుల పాల్గొనవచ్చని, అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. చైర్మన్ జి. జాన్ సుందర్ రావు మాట్లాడుతూ ఈ కూటములలో భారత దేశ యువతీ యువకులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, సన్మార్గములో ఉండేటట్లు బోధిస్తామని తెలిపారు.ఆరు రోజులపాటు జరిగె కార్యక్రమానికి దేశ నలుమూలల నుండి వచ్చే యువతీ యువకులకు ప్రత్యేకమైన ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు.యువతీ, యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గానసభలో మెగా నృత్య ప్రదర్శన

గాన సభ లో మయూరి ఆర్ట్స్ రికార్డు నమోదుకు మెగా నృత్య ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి మే 26 (ప్రభాతవార్త) : ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ మయూరి ఆర్ట్స్ శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై యు ఎస్ ఏ బుక్ ఆఫ్ రికార్డ్ నమోదు కోసం భారీ నృత్య ప్రదర్శన నిర్వహించారు వివిధ నృత్య గురువుల శిష్య బృందం సుమారు మూడు వందల పైగా పలువురు వాగ్గేయ కారుల కీర్తనలకు అనుగుణం శాస్త్రీయ నృత్య అంశాలు తో పాటు జానపద నృత్యాలు ప్రదర్శించారు ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త వెంకట్ కళా కారులకు సర్టిఫికెట్ లు జ్ఞాపిక లు బహుకరించారు సంస్థ స్థాపకులు రాధ పర్యవేక్షణ చేశారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

: పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

మహేష్ కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న తొలుపునూరి కృష్ణగౌడ్, నాగభూషణం

హైదరాబాద్, మే 26 ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగభూషణం,కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్‌లు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని ప్రతి కార్యకర్త సమన్వయంతో పార్టీ ఇచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా అన్నారు.

కుత్బుల్లాపూర్ వరదనీటి నాలాల అభివృద్ధి పనులు వేగవంతం : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, మే 26 ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన రామిరెడ్డి నగర్, సూర్యానగర్‌ల తోపాటు కెమికల్‌నాలాకు ఆనుకుని ఉన్న ప్రతిబస్తీ, కాలనీలను వరదనీటి ప్రమాదం నుండి కాపాడేందుకు చర్యలు చేపడతామని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ హామీఇచ్చారు. మంగళ వారం కుత్బుల్లాపూర్ పరిధిలోని రామిరెడ్డినగర్, సూర్యానగర్‌లలో పర్యటించి అనంతరం సూర్యానగర్ కమ్యూనిటీ హాలులో జరిగిన సమావేశంలో నాలాల విస్తరణపై సంక్షేమ సంఘాల ప్రతినిధులతో చర్చించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే అతిపాతవైన రామిరెడ్డినగర్, సూర్యానగర్, పాపయ్యయాదవ్‌నగర్ నాలా విస్తరణకు వేగవంతంగా పనులను నిర్వహించి రాబోయే వర్షాకాలం లోపు అన్ని నాలాలకు రిటర్నింగ్‌వాల్స్‌ను పూర్తిచేస్తామని హామీఇచ్చారు. చింతల్ రామిరెడ్డినగర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరీఅయ్యి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని త్వరలో శంకుస్థాపన చేసి పనులను పూర్తిచేస్తామని హామీఇచ్చారు. చింతల్ రామిరెడ్డినగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు గల్వా యాదవరెడ్డి మాట్లాడుతూ జగద్గిరిగుట్ట నుండి లోతట్టు ప్రాంతాలైన రామిరెడ్డినగర్, సూర్యానగర్ పాపయ్యయాదవ్‌నగర్ ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల కాలనీలు, బస్తీలను వరదనీరు నింపివేస్తూ ఆందోళనకు గురిచేస్తుందని ఎంఎల్ఎ వివేకానంద్ దృష్టికి తీసుకువచ్చారు. రామిరెడ్డినగర్ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి రాజన్నగౌడ్, ఉపాధ్యక్షులు హీరాలాల్, సురేశ్, జయేందర్‌గౌడ్, సూర్యానగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు అశోక్‌గౌడ్, ప్రధానకార్యదర్శి సురేశ్, గణేష్‌నగర్ సంక్షేమ సంఘ ప్రతినిధులు యాదగిరి(బాపు), నాయకులు దేవర కొండ శ్రీనివాస్, సత్తిరెడ్డితదితరులు తమతమ కాలనీల సమస్యలను ఎంఎల్ఎ వివేకానంద్‌కు వివరించారు. ఈసందర్భంగా వివిధ విభాగాల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధశతాబ్దం పూర్తియిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణోత్సవాలు

సైఫాబాద్, మే 26 ప్రభాతవార్త:

బంజారాలను 1976లో బంజారాల అశాజ్యోతి నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎస్టీ జాబితాలో చేర్చి అర్థ శతాబ్దం పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహిస్తూ ఆమె చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించాలని పలువురు బంజారా నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన బంజారా నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ మాసంలో గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో భారీగా ర్యాలీలకు ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. 2 వేల మంది యువతతో భారీ ర్యాలీని హైదరాబాద్ నగరంలో చేపడతామని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బంజారాల ముఖ్య ప్రజా ప్రతినిధులతో ఈ సమావేశం కొనసాగింది. నాడు (18-9-1976) ఇందిరాగాంధీ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం వల్లనే నేడు బంజారా సమాజానికి సామాజిక న్యాయం జరిగిందన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో గిరిజన బిడ్డలకు ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపి బలరామ్ నాయక్, ఎంఎల్‌సి కేతావత్ శంకర్‌నాయక్, ఎంఎల్ఎ మలోత్ రామ్‌దాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములునాయక్, మాజీ మంత్రి రవీందర్‌నాయక్, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, టి పిసిసి అధికార ప్రతినిధి వెంకన్ననాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కిషన్‌సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్వార్టర్‌లో జరిగిన బంజారా నేతల సమావేశంలో పాల్గొన్న బలరామ్‌నాయక్, శంకర్‌నాయక్, రాందాస్‌నాయక్, ఎస్.రాములునాయక్ తదితరులు

జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆసరా కెవైసి కౌంటర్ : మాజీ కార్పొరేటర్

-తప్పిన ఎండల తిప్పలు.. లబ్ధిదారుల హర్షం

చిక్కడపల్లి మే 26 (ప్రభాతవార్త) : గాంధీనగర్ డివిజన్ పరిధిలోని ఆసరా పెన్షన్ లబ్ధిదారుల సౌకర్యార్థం జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక కేవైసీ అప్‌డేట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. మాజీ కార్పొరేటర్ శ్రీమతి ఎ.పావని వినయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మంగళవారం ఆమె బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పావని వినయ్ మాట్లాడుతూ ముషీరాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో రద్దీ కారణంగా వృద్ధులు, మహిళలు మండుటెండల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి, స్థానికంగానే ఈ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. దీనివల్ల లబ్ధిదారులకు కేవైసీ ప్రక్రియ ఎంతో సులభతరమైందని పేర్కొన్నారు. మొదటి రోజు దాదాపు 70 మంది లబ్ధిదారులు తమ కేవైసీని పూర్తి చేసుకున్నారని వివరించారు.

నేడు కొనసాగనున్న ప్రక్రియ

బుధవారం కూడా ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఎంఆర్ఓ అధికారుల ఆధ్వర్యంలో ఈ అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతుందని పావని వినయ్‌కుమార్ తెలిపారు. డివిజన్‌లోని పెన్షన్ లబ్ధిదారులు, మహిళలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శివ సత్యప్రసాద్, రాము, భార్గవి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, వీఎస్‌టీ రాజు, ఎం.ఉమేష్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కౌంటర్ ఏర్పాటుపై స్థానిక ప్రజలు సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు.

జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆసరా కేవైసీ కౌంటర్

పురానాపూల్‌లో పర్యటించిన రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ భారతి హొళ్లికేరి

చార్మినార్,మే 26 ప్రభాతవార్త : ప్రజలు నుంచి సమగ్రమైన సమాచారాన్ని సేకరించి జనగణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్ భారతి హొల్లికేరి అధికారులను ఆదేశించారు.జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ పరిధిలోని పురానాపూల్ ప్రాంతంలో జరుగుతున్న జనగణన ప్రక్రియను మంగళవారం రాష్ట్ర సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్ భారతి హొల్లికేరి,చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కే.సత్యనారాయణతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పురానాపూల్‌లో ఇంటింటికి తిరుగుతూ ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వే విధానం,ప్రజలనుంచి వివరాలు సేకరణ నమోదు ప్రక్రియపై భారతి హొల్లికేరి ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన 34 ప్రశ్నలను తప్పని సరిగా సేకరించాలని అధికారులను ఆదేశించారు.జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండ ఖచ్చితమైన సమాచారం నమోదు చేయటం అత్యంత ముఖ్యమని భారతి హొల్లికేరి తెలిపారు.ప్రజలు కూడ అధికారులకు సహకరించి సరైన సమాచారంఅందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ, చార్మినార్ డిఎంసి సరిత, సంబంధిత విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన మహిళల కళ ప్రదర్శనలు

మహిళా కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలోని దృశ్యం

రవీంద్రభారతి, మే 26 ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన ఏప్రిల్ 1నుండి నిర్విరామంగా జరుగుతున్న 99 రోజుల ప్రతిష్టాత్మక సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో భాగంగా రవీంద్ర భారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో వివిధ తెలంగాణ కళా సాంస్కృతిక మహోత్సవాలలో భాగంగా తెలంగాణ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పట్టంకడుతూ మంగళవారం రాత్రి మహిళా కళాకారుల వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు కళాభిమానులు, ఆహుతులను ఉర్రూతలూగించాయి. ముఖ్యంగా గద్దం భారతి బృందం ప్రదర్శించిన మహిళా కోలాటం; రమా బృందం ప్రదర్శించిన మహిళా డప్పుల దరువు ధూంధాంగా సాగాయి. అలాగే వరంగల్ జిల్లా నుండి విచ్చేసిన సువర్ణ జానపదగేయం, శివకళ్యాణి కవితాగానం మంత్రముగ్ధులను చేశాయి. వ్యాఖ్యాతలుగా సోని, విద్యానందచారి, శ్రీనివాసరాజులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఆయా కళాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు.

ఓఆర్ఆర్‌పై నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

-వాహనాదారులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాల పంపిణీ

అత్తాపూర్ మే26 ,ప్రభాతవార్త : ఔటర్ రింగ్ రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ సిహెచ్ రాజు హెచ్చరించారు.ఇటీవల ఓఆర్ఆర్‌పై వరసగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో మంగళవారం ఓఆర్ఆర్ ఎగ్జిట్ 17 వద్ద ట్రాఫిక్ సిఐ రాజుతో కలిసి ట్రాఫిక్ ఎసిపి రామకృష్ణ వాహనదారులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం వారు మాట్లాడారు..ఓఆర్ఆర్ పై వాహనాదారులు నిబంధనలకు విరుద్ధంగా నిలిపడంతో రోడ్డు ప్రమాదాలు చేసుకుంటున్నాయని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలిపివేయడం,పార్కింగ్ చేయడంతో ప్రమాదాలకు దారితీస్తుందని అధిక వేగంతో వెళ్తున్న వాహనాల వల్ల ప్రాణాపాయం సంభవించవచ్చని వాహనానికి యాంత్రిక లోపం ఏర్పడితే వెంటనే హజార్డ్ లైట్లు వేయాలని నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు ,జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అత్యవసర సహాయం కోసం వెంటనే 1449/1800 5996699లను సంప్రదించాలని సూచించారు.

ఓటరు జాబితా ప్రక్షాళనకు అన్నిపార్టీలు మద్దతుగా నిలవాలి

కుత్బుల్లాపూర్, మే 26 ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే ప్రత్యేక సంక్షిప్త సవరణ పాదర్శకంగా జరుగుతుందని జోనల్ కమిషనర్(ఐఎస్) అధికారి పర్వేశ్‌కుమార్ హామీఇచ్చారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన అన్నిపార్టీల ప్రతినిధుల సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌ఇంచార్జి కొలను హనుమంతరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రతినిధులు మొహ్మద్ జాకీర్, బేక్‌శ్రీను, భైరి ప్రశాంత్, శివకుమార్‌లు పాల్గొని పలు సలహాలు, సూచనలు జోనల్ కమిషనర్ పర్వేశ్‌కుమార్‌కు చేశారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణ ప్రక్రియ,పారదర్శకంగా, విజయవంతంగా పూర్తిచేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై జోనల్ కమీషనర్ పర్వేశ్‌కుమార్‌తో చర్చించారు.సందర్భంగా కుత్బు ల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే సర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అన్నిపార్టీలకు అవగాహణ కల్పించడంతోపాటు సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

నా స్మృతి పథంలో జీవిత అనుభవాల సారం : జస్టిస్ రాధారాణి

డాక్టర్ వంశీ రామరాజు రచించిన నా స్మృతి పథంలో గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ రాధారాణి

చిక్కడపల్లి మే 26 (ప్రభాతవార్త) : వంశీ రామరాజు రచించిన నా స్మృతి పథం లో రెండవ భాగం ఆయన జీవిత అనుభవాల సారం అని రాష్ట్ర వినియోగ దారుల వివాదాల పరిష్కార కమిషన్ ఛైర్ పర్సన్ జస్టిస్ రాధా రాణి అన్నారు మంగళవారం వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో వందే రామ రాజు రచించిన నా స్మృతి పథం లో రెండవ భాగం ఆవిష్కరణ, ప్రముఖ నటుడు చంద్ర మోహన్ వంశీ గ్లోబెల్ పేరిట అవార్డు నటి రోజా రమణి నిర్మాత లు ఏడిద రాజా శివలింక కృష్ణ ప్రసాద్ రేలంగి నరసింహారావు కాస్ట్యూమ్స్ డిజైనర్ సాంబశివ రావు లకు ప్రదాన సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధా రాణి అవార్డ్ ప్రదానం చేసి గ్రంథ ఆవిష్కరణ చేసి మాట్లాడారు రామ రాజు తన పుస్తకం లో తనకు పరిచయం ఉన్న ప్రముఖుల గురించి ఆసక్తి కరంగా రాశారు అని చెప్పారు చంద్రమోహన్ విభిన్న కథా నాయకుడు అని ఆయన పేరిట అవార్డ్ లు ఇవ్వటం ప్రత్యేకించి కాస్ట్యూమ్ డిజైనర్ కి ఇవ్వటం విశేషం అన్నారు అధ్యక్షత వహించి డాక్టర్ రమణ మాట్లాడుతూ రామ రాజు వంశీ సంస్థ ల అధినేత గానే కాక 36, పుస్తకాలు రచయిత గా కూడా గుర్తింపు పొందారు అని అభినందించారు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య నిత్యానంద రావు మాట్లాడుతూ ఆర్థికం గా ప్రణాళిక ప్రకారం వంశీ రామరాజు కార్యక్రమాలు చేస్తారు అని చెప్పారు వెదిక పై రచయిత బురుగుపల్లి రాధా కృష్ణ జలంధర చంద్ర మోహన్ సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు తొలుత డాక్టర్ తెన్నేటి వెంకటేశ్వరరావు రచించిన అరవింద కథ ను శ్రీ జ నాటకీ కరణ చేసి దర్శకత్వం లో ప్రదర్శించారు సుంకర పల్లి శైలజ సుధా మయి పర్యవేక్షణ చేశారు

ఖాళీ బిందెలతో బిఆర్ఎస్ నేతల ఆందోళన

జూబ్లీహిల్స్, మే 26, ప్రభాతవార్తః

బంజారాహిల్స్ రోడ్ నంబరు 7లోని జలమండలి కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో మంగళవారం ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. గత రెండు నెలలుగా పలు బస్తీలు, కాలనీలలో సమయానికి తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం ఉదయ్‌నగర్‌కు చెందిన ముర్తుజా ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని రోడ్ నెంబర్ 7లోని జలమండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డీజీఎం శరత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి, మాజీ ఛైర్మన్ విప్లవ్ కుమార్, బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్ నాయుడు, సుజాత, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, బస్తీవాసులు కాలి బిందెలతో నిరసన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి రావడం చాలా దురదృష్టకరమన్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో లో ప్రెజర్ వాటర్ సమస్యతో పాటు సమయానికి నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి అని డీజీఎం శరత్ కుమార్‌ని కోరామన్నారు. డీజీఎం స్పందిస్తూ ఒకటి రెండు రోజుల్లో స్వయంగా సంబంధిత బస్తీలు, కాలనీలను సందర్శించి సమస్య ఎక్కడ ఉందో గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటామని, ప్రజలకు సమయానికి తాగునీరు అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీనియర్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సారంగపాణి, నాగరాజు, ఆంజనేయులు, శంకర్ ముదిరాజ్, శ్రీకాంత్, నరసింహ, ఈసుబాయ్, అన్వర్, అయూబ్, అక్తర్, రమేష్, రఘు, అనురాధ, నాగమణి, శ్రీదేవి, శశి ప్రతాప్ రెడ్డి, రాజేశ్వర్, విశ్వనాథం, శ్రీనివాస్, కృష్ణమ్మ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న స్థానికులు, బీఆర్ఎస్ నేతలు

కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం

సన్నాహక సమావేశం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నిజాంపేట్, మే 26, ప్రభాతవార్త

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో మంగళవారం ఈ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మానకొండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామ, మండల కమిటీలను మరింత బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు.ఓట్ల తొలగింపులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, నకిలీ ఓట్ల తొలగింపులో బూత్ స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చా రు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన వారికే సంక్షేమ పథకాలు

వివరాలను సేకరించిన రెవెన్యూ అధికారులతో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దంసతీష్‌గౌడ్

గన్‌ఫౌండ్రి,మే 26 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమ పథకాలను పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నాంపల్లి మండల తహసీల్దార్ సహీముద్దీన్ అన్నారు.రెవెన్యూ అధికారులు ఇసామియా బజార్ తదితర బస్తీలో పెన్షన్లు పొందుతున్న 200మందివివరాలను సేకరించారు. వృద్ధులు,వికలాంగులు,ఒంటరి మహిళలు జీవించి ఉన్నారా లేక మృతి చెందరా అనే విషయాన్ని నిర్ధారించుకునే క్రమంలో ప్రభుత్వం అందిస్తున్న పెన్షర్ల వివరాలను సేకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధా న కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ మాట్లాడుతూ పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొత్త వారికి ప్రభుత్వం స్పందించి పెన్ష న్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రేమ్‌యాదవ్,రాధకృష్ణ,లోహిత్,ఆనంద్ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జైలు,జరిమానా

అత్తాపూర్ మే26 ,ప్రభాతవార్త : నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి కేసులో నింది తుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఫోక్సో కోర్టు తీర్పు వెలువరించింది.సిఐ ముత్తు యాదవ్ వివ రాల ప్రకారం...రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఉప్పర్‌పల్లి ఎర్రబోడలో 04-06-2019లో బాలిక ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటోంది.ఈ క్రమంలో పొరుగున ఉండే నిందితుడు చిల్కూర్ సందీప్ కుమార్ అలియాస్ శ్యామ్ బాలికకు మాయ మాటలు చెప్పి తన నివాసానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజేంద్ర నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో ఆధారాలు సమర్పించగా మంగళవారం అత్యాచారం కేసులో నిందితుడిని దోషిగా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి నిర్ధారించారు.దీంతో నిందితుడుకి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షణతో పాటు రూ.50వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.3లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది..ఈ కేసు దర్యాప్తులో అప్పటి దర్యాప్త అధికారి ఎసిపి అశోక్ చక్రవర్తి ,స్పెషల్ పిపి వెంకటేశ్వర రెడ్డి,సిడిఓ వి.కృష్ణయ్య,సమన్లు అధికారి నరిసింహులు ,ఇతర పోలీసు సిబ్బంది కీలకంగా వ్యవరించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన పోలీస్ అధికారులను కమిషనర్ వి.సి. సజ్జనార్, ప్రత్యేకంగా అభినందించారు.

సిడిఈడబ్ల్యు కౌన్సెలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

జూబ్లీహిల్స్, మే 26, ప్రభాతవార్తః

కౌన్సెలింగ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన వెన్నంరెడ్డి యశ్వంత్ తండ్రి వెన్నంరెడ్డి నరసింహమూర్తి(55) ఈ నెల 23న పంజాగుట్ట పోలీస్ స్టేషన్ సమీపంలోని సిడిఈడబ్ల్యు కౌన్సెలింగ్ సెంటర్‌కు వెళ్లారు. ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి కౌన్సెలింగ్ కోసం వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే కౌన్సెలింగ్ అనంతరం నరసింహమూర్తి ఇంటికి తిరిగి రాలేదని, అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియడం లేదు. దీనికితోడు ఇంటి నుంచి బయలుదేరే సమయంలో తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే మర్చిపోయి వెళ్లడంతో ఆయనను సంప్రదించే అవకాశం లేకుండా పోయింది. కుటుంబ సభ్యులు స్వయంగా అనేక ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శోభ రియల్ ఎస్టేట్ సంస్థపై కేసు నమోదు

- పంజాగుట్టలో ఎన్ఆర్ఐ వైద్యుడి ఫిర్యాదు

జూబ్లీహిల్స్, మే 26, ప్రభాతవార్తః

ఎన్ఆర్ఐ వైద్యుడిని మోసగించిన సంఘటనలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ శోభ లిమిటెడ్‌పై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. అమెరికా పౌరుడు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసిఐ) అయిన డాక్టర్ అలీ ఖురేషీ ప్రస్తుతం అమెరికా పౌరసత్వంతో ఉన్నారు. స్వస్థలం హైదరాబాద్ కావడంతో ఇక్కడ ఫ్లాట్ కొనుగోలు చేయాలని నిర్ణయించి, శోభ లిమిటెడ్ చేపడుతున్న శోభ వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టులో ఫ్లాట్ బుక్ చేసుకున్నారు. మొదట తన తల్లి అసిమా ఖురేషీ పేరుతో ఫ్లాట్ నంబర్ 4142 బుక్ చేసి, 2025 ఏప్రిల్ 28న రూ.1 లక్ష అడ్వాన్స్ చెల్లించారు. అనంతరం బుకింగ్‌ను తన పేరుకు మార్చి, ఫ్లాట్ నంబర్ 1022బిగా మార్చినట్లు తెలిపారు. తర్వాత విడతల వారీగా రూ.95.05 లక్షలు చెల్లించినప్పటికీ, సంస్థ నుంచి ఎలాంటి కేటాయింపు లేఖ రాలేదు. ఇదే విషయమై సంస్థను పలుమార్లు ప్రశ్నించగా, అదనంగా రూ.87.56 లక్షలు చెల్లిస్తేనే ఒప్పంద పత్రాలు ఇస్తామని సంస్థ ప్రతినిధులు ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో సంస్థకు చెందిన అధికార ప్రతినిధి రమేష్ సూచనల మేరకు 2025 అక్టోబర్ 24న అదనపు మొత్తానికి చెక్కు ఇచ్చారు. తన కష్టార్జిత డబ్బు అయిన రూ.95 లక్షలు తీసుకుని, ఫ్లాట్‌కు సంబంధించిన సరైన పత్రాలు ఇవ్వకుండా మోసం చేశారని, డబ్బు తిరిగి ఇవ్వడానికీ నిరాకరిస్తున్నారని డాక్టర్ అలీ ఖురేషీ సంస్థ ఛైర్మన్ రవి పీఎన్‌సీ మీనన్‌తోపాటు సంస్థ ఉద్యోగులు రమేష్, జ్యోత్స్నలపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు కింద మంటలు,అప్రమత్తమైన డ్రైవర్

అఫ్జల్‌గంజ్,మే26ప్రభాతవార్త:

మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆర్‌టిసి బస్సు కింద అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.ఈసంఘటనల మంగళవారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు,ఆర్‌టిసి అధికారుల కథనం ప్రకారం...మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోని గద్వాల ఫ్లాట్ ఫారంపై ఉన్నబస్సు కింద నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి.ఇది గమనించిన ప్రయాణికులు,ఆర్‌టిసి డ్రైవర్‌కు చెప్పడంతో అప్రమత్తమైన ఆర్‌టిసి బస్సు డ్రైవర్ కింద దిగారు.ఆ సమయంలో ఆర్‌టిసి బస్సుల్లోప్రయాణికులు లేకపోవడంతో పెన్ను ముప్పు తప్పింది.బస్సు కింద మంటలు వ్యాపించడంతో స్పందించిన ప్రయాణికులు,ఆర్‌టిసి సిబ్బంది నీళ్లతో మంటలను ఆర్పివేశారు.మంటలను చూసిన ప్రయాణికులుతీవ్ర భయాందోళనకు గురయ్యారు.ఎండ వేడిమి కావడంతోనే మంటలు వ్యాపించి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు.వాహనాదారులు కూడా తమ వాహనాలను కూడా ఎండలో పెట్టకుండా నీడలో ఉంచాలని ఆర్‌టిసి అధికారులు,పోలీసులు కోరారు.ఒక వేళ బస్సు నడుస్తున్న సమయంలో ఇలాంటి ప్రమాద సంభవిస్తే ఏది గుర్తు చేసుకుని దడుసుకుంటున్నారు.పెద్ద ఆస్తినష్టం కాని,ప్రాణ నష్టంకాని సంభవించక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

సికింద్రాబాద్, మే 26 ప్రభాతవార్త: గాంధీ ఆసుపత్రి వెనకాల పద్మారావు నగర్ లో కొనసాగుతున్న డ్రైనేజి పనులను వెంటనే పూర్తి చేసి అనునిత్యం ప్రజలకు జరుగుతున్న ట్రాఫిక్ సమస్యను తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ డిమాండ్ చేసారు. జీహెచ్ఎంసీ ఏఈ మురళి, వాటర్ వర్క్స్ ఏఈ సలీమ్‌తో కలిసి మంగళవారం ఈ ప్రాంతంలో పర్యటించారు. గత రెండు నెలలుగా ఈ పనులను కొనసాగిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న కాంట్రాక్టర్ పట్ల కఠినంగా వ్యవహరించి త్వరగా పనులు ముగించాలని, పని పూర్తయినా ప్రాంతంలో మట్టి కుప్పలను తొలగించి అనునిత్యం ప్రయాణికులకు కలుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని పవన్ కుమార్ గౌడ్ సూచించారు. అంతేకాకుండా డ్రైనేజ్ పని పూర్తి కాగానే రోడ్డు రిస్టోరేషన్ పనులను వచ్చే సోమవారం నుంచి ప్రారంభం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వెంకటేషన్ రాజు, మహేందర్ గౌడ్, సుధాకర్ రెడ్డి,శ్రీరాములు అంబులెన్సు సురేష్, ముక్క శ్రీనివాస్, లంబు శ్రీనివాస్, రమణ, వెంకట్ ముదిరాజ్, నాగలక్ష్మిలు పాల్గొన్నారు.

మహిళల సాధికారత కోసం నిరంతరం కృషి చేయాలి

గద్వాల్ విజయలక్ష్మిని సత్కరిస్తున్న కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు అమృతం వీర, తదితరులు

సైఫాబాద్, మే 26 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్‌గా నియమితులైన గద్వాల్ విజయలక్ష్మిని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధి బృందం అభినందించి, ఘనంగా సత్కరించింది. మంగళవారం నాడిక్కడ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అమృతం వీర, పలువురు సామాజిక కార్యకర్తలు, ప్రతినిధులు ఆమెకు బోకే ఇచ్చి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమృతం వీర మాట్లాడుతూ మహిళలకు జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకువచ్చి వారికి అండగా నిలిచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నాయకులు సుధీర్‌కుమార్, అయూబ్‌ఖాన్, సంతోష్‌సింగ్, అజయ్‌కుమార్, శివనాగరాజు యాదవ్, ఖాజా మొయినుద్దీన్, అక్రమ్ హుస్సెన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు నమోదుచేయటం దుర్మార్గం

తెలంగాణ అడ్వకేట్ జెఎసి కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ముషీరాబాద్, మే 26, ప్రభాతవార్త: ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కే.నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు నమోదు చేయటం, అరెస్ట్ చేయాలని ప్రయత్నించటం దుర్మార్గమని, తెలంగాన పౌరులుగా దీనిని ఖండిస్తున్నామని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమస్యలపై విశ్లేషణ చేయటం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉందని గుర్తు చేశారు. నాగేశ్వర్ విశ్లేషణలు నచ్చకపోతే ప్రసార మాధ్యమాల ద్వారా ఖండించాలి తప్ప, కేసులు పెట్టి, వారి గొంతు నొక్కే ప్రయత్నం చేయటం సరికాదని హితవు పలికారు. మౌనంగా సహజీవనం చేస్తున్న తెలుగు రాష్ట్రాల మధ్య ఇటువంటి చర్యలు వైషమ్యాలను కలిగిస్తాయని, తక్షణమే ఏపీ ప్రభుత్వం ఇటువంటి చర్యలను వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షునిగా రమేష్‌యాదవ్

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్‌కు ధన్యవాదములు తెలుపుతున్న రమేష్‌యాదవ్

ముషీరాబాద్, మే 26, ప్రభాతవార్త: కాంగ్రెస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షునిగా సీనియర్ కాంగ్రెస్ యువనేత రమేష్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్‌ను కలసి, శాలువాతో సత్కరించి, తనకు డివిజన్ అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యతను స్వీకరించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు పి.భాస్కర్, నాయకులు కృష్ణ, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్

సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, మే 26 ప్రభాతవార్త: పేదల ప్రాణాలు కాపాడేందుకు గాంధీ హాస్పిటల్‌కు పేషెంట్లను తీసుకొచ్చే ఆశా వర్కర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం, కూర్చోవడానికి గది, వాష్‌రూమ్ సౌకర్యం కల్పించడం లేదని ఆశా వర్కర్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తీసుకురావడంతో మంగళవారం ఆయన గాంధీ హాస్పిటల్‌ను సందర్శించి సూపరింటెండెంట్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, ఆశా వర్కర్లు పేదల కోసం పనిచేసే ఫ్రంట్‌లైన్ వారియర్స్ అని, వారికి వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రత్యేక గదిని తక్షణమే ఏర్పాటు చేసి, పరిశుభ్రమైన వాష్‌రూమ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం హాస్పిటల్‌లోని పలు వార్డులను కలియతిరిగి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. హాస్పిటల్‌కు అవసరమైన మౌలిక వసతులు, పరికరాలు ఏవైనా ఉంటే నా దృష్టికి తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేయిస్తానని సూపరింటెండెంట్‌కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

చతుర్భుజ ఆంజనేయునికి లక్ష కొవ్వొతులతో దీపారాధన

చాంద్రాయణగుట్ట, మే 26, ప్రభాతవార్త : అధిక జ్యేష్ఠ మాసం, మంగళవారాన్ని పురస్కరించుకొని పాతబస్తీ చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన చారిత్రక శ్రీ చతుర్భుజ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి లక్ష కొవ్వొత్తులతో దీపారధన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ వాస్తవ్యులు స్వామివారిని దర్శించుకొని గణపతి, గౌరి పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో లక్ష కొవ్వొత్తులతో దీపాలు వెలిగించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం వెంకటరాజం

సైఫాబాద్, మే 26 ప్రభాతవార్త: దేశంలోనే తొలిసారిగా తెలంగాణ మేరు కార్పోరేషన్ ఏర్పాటు చేసి 50 కోట్ల రూపాయల నిధులు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి వర్గం, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌కు కార్పోరేషన్ ఛైర్మన్ సంఘ వెంకటరాజం, వైస్-ఛైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 9 లక్షల మందికిపైగా మేర, మేరు కులస్తులు ఉన్నారని, వీరిలో 80 శాతం మంది కడుపేదరికంలో జీవిస్తున్నారని, గత ప్రభుత్వాలు ఏనాడు మేరు కులస్తులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇంత వరకు మేరు కులస్తులకు మేరు కార్పోరేషన్ ఏర్పాటు చేయలేదని, రేవంత్‌రెడ్డి సిఎం అయిన తరువాత కార్పోరేషన్ ఏర్పాటు చేసి 50 కోట్లు కేటాయించడం వల్ల కొంత మేరకు మేరు కులస్తులు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో కార్పోరేషన్‌కు ప్రభుత్వం ఆర్థిక పరిపుష్టి, ఉపాధి సంక్షేమ పథకాలకు అధిక నిధులు కేటాయించగలదన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. మేరు కులస్తులకు సబ్సీడితో కూడిన రుణాలు, చిన్న పరిశ్రమలు, కుల వృత్తికి సంబంధించిన పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. మేరు కులస్తులందరిని ఒకే తాటిపైకి తీసుకువచ్చి కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో మేరు సంఘం నాయకులురమేష్, రాము, కీర్తి శేఖర్, సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణారావు తీరును ఖండించిన డా.సత్యం శ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, మే 26, ప్రభాతవార్త

కూకట్‌పల్లి నియోజకవర్గంలో మీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులమీద శ్వేతా పత్రం విడుదల చేయాలనీ పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు.కూకట్‌పల్లిలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి మీద మాట్లాడిన పరుష పదజాలాన్ని డా. సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కృష్ణారావు హద్దులు దాటి మాట్లాడుతున్నాడని ఇకనైనా పిచ్చికూతలు కూయడం ఆపకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మీ తాటాక చప్పుళ్ళతో భయపడే రోజులు పోయాయి కాకి కూతలు మానుకోండనీ ప్రజలకు సేవ ఎలా చేయాలో నేర్చుకోండనీ హితవు పలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా అబద్ధాలు ఆడుతున్నారని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. మైక్ ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడడం సరికాదని అన్నారు. మీ హయాంలో జరిగిన 90 శాతం అభివృద్ధి పనుల మీద శ్వేతా పత్రం విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ అందులో భాగంగా హైదరాబాద్ ప్రగతి ప్రస్థానంలో సరికొత్త అధ్యాయం మొదలైందని గొప్ప చరిత్ర కలిగిన మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష ్యంతో ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నదని అన్నారు. పరిపాలన సౌలభ్యం, వేగవంతమైన అభివృద్ధి కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించిందని దీనిపై ఎమ్మెల్యేకు అవగాహన లేకపోవడం విచారకరం అన్నారు. ఇది ఎన్నికల అభివృద్ధి కాదు నిరంతరం కొనసాగే ప్రక్రియ కాంగ్రెస్ పార్టీ కమిట్మెంట్ అని సత్యం శ్రీరంగం అన్నారు.

సీఎంఆర్ఎఫ్ అందజేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, మే 26 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నిరుపేదల నిమ్స్ హాస్పిటల్ వైద్య చికిత్స కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7,75,000/ విలువైన ఎల్‌ఓసీలను ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సంరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో ప్రభుత్వం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తోందని తెలిపారు. నిమ్స్‌లో మెరుగైన చికిత్స ఉంటుందని, సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని మనసారా కోరుకుంటున్నాను అని తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కంటోన్మెంట్, మే 26 ప్రభాతవార్త: ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, అనుమతులు లేకుండా బోర్ వెల్స్ వేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మారేడుపల్లి తాసిల్దార్ అసదుల్లా ఖాన్ హెచ్చరించారు. మంగళవారం వెస్టుమారేడ్పల్లిలోని బూసారెడ్డి గూడాలోఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి అక్రమంగా స్థలాన్ని ఆక్రమించుకొని షెడ్డు ఏర్పాటు చేశారు. అదేవిధంగా దాని పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిబంధనల విరుద్ధంగా అనుమతి లేకుండా వేసిన బోర్లను వేశారు. విషయం తెలుసుకున్న మారేడుపల్లి తాసిల్దార్ మంగళవారం జెసిబి సహాయంతో కూల్చివేశారు అక్రమంగా వేసిన బోర్వెల్ ను సీజ్ చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మాదాపూర్, మే 26 (ప్రభాత వార్త): ఆడపిల్లలకు చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల తల్లి ఆరోగ్యానికి ప్రమాదకర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని, బిడ్డలు బలహీనంగా పుట్టడం, చదువు మధ్యలోనే ఆగిపోవడం, మానసిక ఒత్తిడులు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయని శేర్లింగంపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆదిత్య నగర్ సెక్టర్ సూపర్వైజర్ ఠాగూర్ కమలాబాయి అన్నారు. మంగళవారం ఆదిత్య నగర్ సెక్టర్ పరిధిలోని మాదాపూర్ అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో వార్డు కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకముందు వివాహాలు చేయరాదని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా కాలనీ పెద్దలు, పూజారులు, టెంట్ హౌస్ నిర్వాహకులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఆయేషా, నారాయణమ్మ, ప్రశాంతి, బి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, మే 26, ప్రభాతవార్త

టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపైన బుధవారం నియోజకవర్గంలో ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు పర్యటన ఉన్న నేపథ్యంలో తీసుకోవాల్సి న చర్యలపైన చర్చించారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రమేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి బాలాజీ, తూము వేణు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కొప్పుశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమీద్ బస్తీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

జిహెచ్ఎంసి, ఐలా అధికారులకు వినతి

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జీడిమెట్ల, మే 26, ప్రభాతవార్త

130 సుభాస్ నగర్ డివిజన్ పరిధిలోని హమీద్ బస్తీ మసీదు సమీపంలో గత తొమ్మిది నెలలుగా డ్రైనేజ్ పొంగిపొర్లుతూ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా ఆ ప్రాంతంలోని ఫ్యాక్టరీల్లో రోజువారీ కూలీ పనులు చేసుకునే కార్మికులు కాలినడకన వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దుర్వాసన, మురుగు నీరు కారణంగా స్థానిక కుటుంబాల పిల్లలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను గమనించిన స్థానిక మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం మాత్రం కనిపించలేదని తెలిపారు. జిహెచ్ఎంసి అధికారులు ఇది తమ పరిధిలోకి రాదని, ఐలా, వాటర్ వర్క్స్ శాఖలకు సంబంధించినదని పేర్కొనగా, ఆయా శాఖలు తిరిగి జిహెచ్ఎంసి వైపు చూపుతూ బాధ్యత తప్పించుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.అదేవిధంగా వాటర్ వర్క్స్ ఏఈ మునీర్ సమస్యను తానే దగ్గరుండి పరిష్కరిస్తానని గత నాలుగు నెలలుగా హామీ ఇస్తూ వచ్చారని, అయితే ఇప్పుడు తనకు సంబంధం లేదంటూ చేతులు ఎత్తేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఈ డ్రైనేజ్ సమస్యకు సం బంధిత అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సత్తాచాటిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు

క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎ.గాంధీ, కె.లక్ష్మణ్, వేణు తదితర ప్రముఖులు

నాంపల్లి, మే 26 ప్రభాతవార్త : ఇటీవల జరిగిన బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరచి పలు విభాగాల్లో గోల్డ్‌మెడల్స్ కైవసం చేసుకుని అకాడమీ సత్తాచాటిచెప్పారు. ఓపెన్ కేటగిరీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో లక్ష్యసంహిత వెంట్రప్రగడ, నీరజ్ కుమార్ జట్లు తమ ఆటతీరుతో స్వర్ణపథకం సాధించి రాష్ట్రస్థాయి టోర్నమెంటుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రధానోత్స వంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, వికారాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, మ్యాచ్ పాయింట్ అకాడమీ ఛైర్మన్ వేణు ముప్పల పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. క్రీడాకారుడు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలను గెలుచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, మే 26, ప్రభాతవార్త

కొంచెం సొంత ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు సూచించారు. మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఖైతలాపూర్‌లోని డబల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో అమృతనగర్ తండకు చేందిన 62 మందికి బుధవారం ఇళ్ల పంపిణీకి సంబంధించి మౌలిక సదుపాయాలు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బాలానగర్ చిత్తారమ్మ బస్తీలో, ఖైతలపూర్‌లో మొట్ట మొదటగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు నిర్మించుకున్నాం అని అయితే అమృతనగర్ తండా వాసులకు గతంలో లాటరీ ద్వారా 67 మందికి ఇళ్లు వచ్చాయని మిగతా 62 మంది నిరుపేదలకు ఇక్కడే కేటాయించామని తెలిపారు. అలాగే స్థానికంగా ఉన్న ప్రజలకు 10 కేటాయించాలని అందులో స్థానికంగా విధులు నిర్వహిస్తున్న విలేకరులకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించే విధంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకి విజ్ఞప్తి చేశారు. ఫతేనగర్‌లోని ఏ ప్రాంతంలో అయితే అమృత నగర్ తండావాసులు ఖాళీ చేశారో ఆ ప్రాంతంలో తిరిగి వారికే ఉపయోగపడే విధంగా ఆ భూమి వద్ద వారికి ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని ఒకవేళ ఆ విధంగా చేయని పక్షంలో సిఎస్ఆర్ ఫండ్ ద్వారా నేనే నిర్మిస్తానని అన్నారు. నిరుపేదల విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలని తాను ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటానని ప్రజలకు మేలు జరుగుతుందంటే పార్టీలకతీతంగా తాను ఎప్పుడు ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, పండాలసతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు బిక్షపతి, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, ఎమ్మార్వో స్వామి, ఇంజనీరింగ్, హౌసింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యునియన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కంటోన్మెంట్, మే 26 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో యాభై ఆరవ సర్వసభ్య సమావేశం మంగళవారం సికింద్రాబాద్ బోయిగూడలోని రైల్వే కళారంగంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షతగా కామ్రేడ్ కలువ శ్రీనివాస్ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ హాజరయ్యారు.కార్యక్రమంలో ముఖ్య ప్రసంగకర్తగా యూనియన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ శంకరరావు పాల్గొని పలు ముఖ్య అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా జూన్ 1వ తేదీ నుండి సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పడుతున్న నేపథ్యంలో, సెంట్రల్ రైల్వే జోన్ నుండి విడిపోయి కొత్త జోన్‌గా అవతరించడం పై ఆయన ప్రస్తావించారు. రైల్వే ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సంస్థాగత బలపరచడం కోసం ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, రైల్వేలో పెరుగుతున్న సమస్యల నేపథ్యంలో ఉద్యోగుల వృత్తిగత భద్రత అత్యంత ప్రాధాన్యమైనదని పేర్కొన్నారు. ఆధునిక రైల్వే సాంకేతికతను అనుసరిస్తూ, ఉద్యోగులు తమ వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా, కొత్తగా ఏర్పడిన సౌత్ వెస్ట్ రైల్వేలోని కొత్త డివిజన్లకు తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల అధ్యక్షులు, డివిజనల్ సెక్రటరీలు, అలాగే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని ప్రతినిధులు పాల్గొన్నారు.

కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు

బండిఅడ్డ వద్ద కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చార్మినార్,మే 26 ప్రభాతవార్త :

పాతబస్తీ బండి అడ్డ రహదారి ప్రక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెసౌకర్యం లేనందున ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్క నుంచి నడిచి వెళ్లాలంటేనే ప్రజలు భయ పడుతున్నారు.నిత్యం బండిఅడ్డ రహదారి వాహనాలతో రద్దీగా ఉంటుంది.అసలే ఇక్కడ రోడ్డు వెడల్పు తక్కువ.రోడ్డంతా ఇరుకిరుకుగా ఉన్నది.రోడ్డును ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.కేబుల్ వైర్లు రోడ్డు మీద ఉన్నాయి.రాత్రి వేళల్లో చీకటిలో నడిచి వెళ్లే ప్రజలు ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్క నుంచి నడిచి వెళ్లాలంటే సందేహిస్తున్నారు.ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఎప్పుడుఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయ పడుతున్నారు.ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి బండి అడ్డ రహదారి ప్రక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేపాల్ వెళ్లిన బేగంబజార్ బిజెపి నాయకులు

బేగంబజార్,మే26ప్రభాతవార్త:

ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా బేగం బజార్ డివిజ న్ బిజెపిమాజీ కార్పొరేటర్ గొంట శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 135 మంది నేపాల్‌లోని చారిత్రాత్మకమైనపరమ శివుని పశుపత్తి దర్శణం కోసం వెళ్లారు.బేగంబజార్ డివిజన్ మాజీ కార్పొరేటరఖ్ గొంటి శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి యేటా ఏదో ఒక పుణ్యక్షేత్రం దర్శనం కోసం తన అభిమా నులు, బిజెపి నాయకులతో కలిసి వెళ్తుంటారు.ఈ సారి నేపాల్ లోని చారిత్రాత్మకమైన పశుపతి మందిరంలోని పరమశివుని దర్శనం కోసం వెళ్లారు. అక్కడ తన వెంట వచ్చే అభిమాను లు,బిజెపి నాయకులు,కార్యకర్తలకుదర్శనంతోపాటు యాత్రలో ఆల్పహారం,భోజనం సొంత ఖర్చుల తో వినియోగం జరుగు తుందన్నారు.ఇప్పటి వరకు 12 జ్యోతిర్లింగాలు,శక్తిపీఠాలు, తిరుపతి దర్శనాలను చేయించడం జరిగిందన్నారు. యాత్రలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుం దన్నా రు.పది రోజుల యాత్రలో నేపాల్‌లోని అన్ని పుణ్యక్షేత్రాలను దర్శనం చేసుకోవడం జరుగుతుందన్నారు.

సొమ్మును దొంగిలించిన ఆఫీస్‌బాయ్ అరెస్ట్

ముషీరాబాద్, మే 26, ప్రభాతవార్త: ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తూ, యజమాని సొమ్మును దొంగిలించిన వ్యక్తిని దోమలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. దోమలగూడ సీఐ అంజద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం వైభవ్‌చౌదరి (42) అనే వ్యాపారి శోభా ట్రేడ్ హౌస్ పేరుతో నూనె వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బీదర్‌కు చెందిన పాటిల్ కిరణ్ (22) శోభాట్రేడ్ హౌస్‌లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 21వ తేదీ వ్యాపార లావాదేవీల నిమిత్తం వైభవ్ చౌదరి తన స్నేహితుని వద్ద 44లక్షల నగదు తీసుకురమ్మని కిరణ్‌ను పంపించాడు. నగదును తీసుకున్న కిరణ్ తిరిగి వైభవ్‌చౌదరికి ఇవ్వకుండా, తన స్నేహితుడైన షిండే జీవన్ అనే ర్యాపిడో రైడర్‌తో కలసి డబ్బును తీసుకుని పారిపోయాడు. వైభవ్‌చౌదరి దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో, బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు ముషీరాబాద్‌లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 41 లక్షల నగదును, రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

చైన్ స్నాచింగ్ నిందితులు అరెస్టు

మీడియాతో మాట్లాడుతున్న డిసిపి కోటిరెడ్డి

పేట్ బషీరాబాద్, మే 26, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ పరిధిలోని పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ ఘటనలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కొంపల్లి జయభేరి కాలనీ సమీపంలో ఓ ఆయిల్ షాపు యజమానురాలు మల్లీశ్వరిపై దాడి చేసి, ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోవడానికి ప్రయత్నించిన నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మల్లాది నరసింహ(22) ను అరెస్ట్ చేసి, దొంగిలించిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిసిపి కోటి రెడ్డి మాట్లాడుతూ మరో ఘటనలో దూలపల్లి టీ జంక్షన్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొన్న మహారాష్ట్రకు చెందిన ఇరానీ గ్యాంగ్ సభ్యుడు హసన్ అలీను కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల వినియోగం వల్ల నేరాలను అరికట్టడం మాత్రమే కాకుండా, ఘటనలు జరిగిన వెంటనే నిందితులను గుర్తించి పట్టుకోవడం సులభమవుతుందని పోలీసులు పేర్కొన్నారు.

లాడ్జి మేనేజర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

చార్మినార్,మే 26 ప్రభాతవార్త :

పాతబస్తీలో ఓ లాడ్జి మేనేజర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని హుస్సేనీ ఆలం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం ప్రకారం.....ఎంఎంపహాడికి చెందిన ఫయాజ్ అబుల్ హుస్సేనీ (33) చార్మినార్ సమీపంలో ఉన్న రాయల్ గెస్ట్‌హౌస్‌మేనేజర్ ఖురేషీతో గొడవ పడ్డాడు.ఫయాజ్ అబుల్ హుస్సేనీ తన వెంట తెచ్చుకున్న కత్తితో రాయల్ గెస్ట్ హౌస్ మేనేజర్ ఖురేషీని చంపటానికి ప్రయత్నించాడు.ఈ సంఘటనలో రాయల్ గెస్ట్ హౌస్ మేనేజర్ ఖురేషి చేతికి గాయాలు అయ్యారు.పోలీసులు ఫయాజ్ అబుల్ హుస్సేనీని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసునుహుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ - కుత్బుల్లాపూర్ జోన్

నిట్ నం. 06/SE/QBZ/CMC/2026-27, తేది: 26.05.2026, పనుల సంఖ్య: 2, అంచనా మొత్తం (రూ.లక్షలలో: 211.00. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ & సమయం/బిడ్ దాఖలు ముగింపు తేదీ & సమయం: 28.05.2026 & మ.2.30 గం. 04.06.2026 & మ.02.30 గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నం.: సూపరింటెండింగ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ జోన్, 7331170020, 7995009077. తదుపరి వివరాలకు ఇ- ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ జోన్, CMC.

DIPR.No.3060-PP/CL/Advt/1/2026-27, తేది: 26.05.2026

ప్రకటన (నోటీసు)

నా క్లయింట్లు అయిన జి. నవనీత్ రాయ్ మరియు తదితరులు తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం ఇమంగూడ గ్రామములోని సర్వే నెంబర్ 55/3 & 55/4 లో గల ఆరెంజ్ కౌంటీలో 250 గజాల విస్తీర్ణం గల ఓపెన్ ప్లాట్ నం.40 (ఫైనల్ లేఅవుట్ పర్మిట్ నెం. 02/Final/Layout/HADA/2009 తేదీ 09-07-2009), ఉత్తరం: ప్లాట్ నం.40 (పార్ట్), దక్షిణం: ప్లాట్ నం.40 (పార్ట్), తూర్పు: పొరుగు భూమి పడమర : 40 అడుగుల వెడల్పు రోడ్డు సరిహద్దులు గల ఓపెన్ ప్లాట్‌కి యజమాని అయిన ఎల్లావు రమణ నుండి సదరు ప్లాట్‌ను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు అందు నిమిత్తం కొంత రొక్కాన్ని (అడ్వాన్స్) చెల్లించారు.

దీని ద్వారా తెలియజేయునది ఏమనగా, సదరు ప్లాట్‌పై ఎవరికైనా ఎలాంటి హక్కులు, టైటిల్ (యాజమాన్య హక్కు) లేదా మరేదైనా ఆసక్తి/వాటా ఉన్నట్లయితే, వారు ఈ నోటీసు వెలువడిన 10 రోజులలోపు తమ వాదనలను నిరూపించడానికి సంబంధించిన అన్ని ఆధార పత్రాలతో సహా తమ క్లెయిమ్‌లను (దరఖాస్తులను) సమర్పించవలసి ఉంటుంది. ఈ గడువు ముగిసిన తర్వాత ఎలాంటి క్లెయిమ్‌లు (ఫిర్యాదులు లేదా అభ్యంతరాలు) స్వీకరించబడవు/ పరిగణనలోకి తీసుకోబడవు.

ఎం.ఎస్. చంద్రేశ్
అడ్వకేట్
ఛాంబర్ నంబర్స్ 305 & 310, 3వ ఫ్లోర్ రాఘవ రత్న టవర్స్, చిరాగ్ అలీ లేన్ అబిడ్స్, హైదరాబాద్.
మొబైల్ నం. 98488 13388

PUBLIC NOTICE

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VII ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, AT: MEDCHAL

O.S No. 273 of 2026

Between: -
Smt. Paru Devi Dewasi & 3 Others ...Petitioners/Plaintiffs
AND
Tahsildar Quthbullapur & Another ...Respondents/Defendants

To,
All Concerned,

It is to inform to the kind notice of all concerned public, that the Plaintiffs, viz., Smt. Paru Devi Dewasi & 3 Others have filed a civil suit, vide O.S No.273 of 2026, for a relief to declare them as the legal heirs of Late GEBARAM AS PRABURAM DEWASI; and the above said Civil Suit O.S.No.273 of 2026 is posted on **17/06/2026 at 10:30 AM**, before the Hon'ble Principal Junior Civil Judge -Cum- VII Additional Judicial Magistrate Of First Class, At Medchal, calling for objections, if any, from all concerned. Hence this notice is being issued to all concerned, in accordance with directions of the Hon'ble Court.

// By order of the court//

G. PREM KUMAR REDDY
ADVOCATE
Office at : Unit No.1217/3/C, Vasavi MPM Grand, Ameerpet - 500073
7097567050,
advpremkreddy@gmail.com

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : చెకోలేకర్ శ్రీనివాస్

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, మే 26, ప్రభాతవార్త:
కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్ పేట నుంచి చెకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వక కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. రానున్న గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృత భాషను అభివృద్ధి చేయాలి : రుగ్వేద ఘనాపాఠీ

సంస్కృత భారతి అధ్యక్షులు రుగ్వేద ఘనాపాఠీ నరేంద్రకాప్రెను సన్మానిస్తున్న స్థానిక నేతలు

ఉప్పల్, మే 26 ప్రభాతవార్త :
తెలంగాణ ప్రాంతంలో సంస్కృత భాషను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సంస్కృత భారతి తెలంగాణ శాఖ అధ్యక్షులు రుగ్వేద ఘనాపీ పాఠీ నరేంద్రకాప్రె, ప్రధాన కార్యదర్శి ఉమేశ్ త్రివేది పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ భరత్ నగర్‌లోని సరస్వతీ శిశు మందిర్‌లో సంస్కృత భాష ప్రవేశ వర్గ సంస్కృత శిక్షణా శిబిరాన్ని వారు ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మెదక్‌లో మల్లినాదజ సూరి సంస్కృత వర్సిటీ ఏర్పాటు కు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇందుకు సానుకూలంగా ఉందన్నారు. సంస్కృత బాష పట్ల ప్రతి ఒక్కరు మక్కువ పెంచుకోవాలన్నారు. ఆరు రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందని, ఈ శిక్షణను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా దీనిని మరింత విస్తృత ప్రచారం చేస్తామన్నారు. అనంతరం నరేంద్ర కాప్రెను స్థానిక నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ ఇంచార్జీ రాజీవ్ గద్రే, కిషోర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా మహిళా వారోత్సవాలు

రామంతాపూర్‌లో జరిగిన మహిళా వారోత్స వాల్లో అవగాహన కల్పిస్తున్న ఉప్పల్ ప్రాజెక్టు అధికారి జె.పద్మావతి, శ్రీధర్ రెడ్డి తదితరులు

రామంతాపూర్, మే 26 ప్రభాతవార్త : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు స్వయం సహాయక సంఘాలకు సంబంధించి మహిళా వారోత్స వాలు నిర్వహిస్తున్నామని ఉప్పల్ సర్కిల్ ప్రాజెక్ట్ అధికారి జె.పద్మావతి తెలిపారు. మహిళా వారోత్స వాలలో భాగంగా మంగళవారం రామంతపూర్, కళ్యాణపురి, ఉప్పల్‌లో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, సంఘాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల వల్ల కలుగుతున్న లాభాల గురించి వారికి వివరించారు. మహిళలు సంఘటితంగా ఉండి సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని, వారు ఆర్థికంగా, సామాజికంగా రాణించేందుకు వీలు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ పాజెక్టు అధికారి జె.పద్మావతి, కమ్యూనిటి ఆర్గనైజర్లు శ్రీధర్ రెడ్డి, వాణి, పుష్పలత, రిసోర్స్ పర్సన్స్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

సమస్యలను పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి, లింగాల రాహుల్‌గౌడ్

ఎల్.బి.నగర్, మే 26 ప్రభాతవార్త: డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ శివశంకర్‌కాలనీ, ఆర్టీసీకాలనీ, శివగంగకాలనీ, శ్రీనివాసకాలనీలలో కొత్తపేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, కాలనీవాసులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి స్థానిక ప్రజల మంచినీటి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు నెల రోజులుగా మంచినీటి సరఫరా లోప్రెషర్ సమస్య కారణంగా ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీల్లో మంచినీటి సరఫరా లోప్రెషర్ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్, మహేష్‌రెడ్డి, మల్లేపాక యాదగిరి, గాలయ్య, ఇటికల యాదగిరి, యాసిన్, బట్టు అంజయ్య, జోగు నగేష్,బాలాజీ,జోగుకృష్ణ, లైన్‌మెన్ విఠల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

హయత్ నగర్, మే 26 ప్రభాతవార్త :
రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యకి తీవ్రంగా గాయపడిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... మంగళవారం సాయంత్రం 4:30 గంటల సమయంలో హయత్ నగర్ లోని లేబర్ అడ్డా సమీపంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని టిఎస్ 29టి 9629 నెంబర్ గల లారీ ఢీకొట్టింది. అతనికి తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్ సహాయంతో ఉస్మానియా హాస్పిటల్ కు తరలించడం జరిగింది. క్షతగాత్రుడికి సంబందించిన వారు వివరాలకు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

మార్కెట్ల అభివృద్ధికి కృషి : చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి

హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, చిత్రంలో వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఇన్చార్జి ఎస్జీఎస్ చిలకా నరసింహారెడ్డి తదితరులు

మలక్ పేట, మే 26, ప్రభాతవార్త:
హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరించనున్నట్లు హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి వివరించారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి అధ్యక్షతన పాలకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ చెకోలెకార్ లక్ష్మి పలు అంశాల గురించి ఇన్చార్జి ఎస్‌జిఎస్ చిలక నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు నేలపాటి రామారావు, బుద్ధ సత్యనారాయణ, అశోక్ గౌడ్, శివాజీ, రాజేందర్ రెడ్డి, మాసరాత్ సుల్తానా, సాయి రాం, కిషన్ సింగ్, ప్రత్యుష తదితరులతో చర్చించారు. అనంతరం చేకోలేకర్ లక్ష్మి మాట్లాడుతూ మలక్ పేట్ మహబూబ్ మాన్షన్ మార్కెట్లో రైతులు కోసం నూతనంగా రూ. 2.75 కోట్లతో మరో షెడ్ ను నిర్మించనునట్లు తెలిపారు. మార్కెట్లలో నెలకొన్న సమస్య లను పరిష్కరిస్తున్నమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లలో మౌలిక సదుపాయా లను కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించా రు. మార్కెట్లలో నూతన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులను చేపడు తున్నట్లు తెలిపారు. తాము పండించే సరుకులను మార్కెట్లలో విక్రయించడానికి తీసుకువచ్చే రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం పడుతున్నామని తెలిపారు. మార్కెట్లకు వచ్చే రైతుల కోసం విశ్రాంతి గదులను ఏర్పాటు చేయడంతో పాటు క్యాంటీన్ సౌకర్యాన్ని కూడా కల్పించడం జరిగిందని వివరించారు. మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన మార్కెట్లుగా తీర్చిదిడమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు. వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఇన్చార్జ్ ఎస్జీఎస్ చిలక నరసింహారెడ్డిలు మాట్లాడుతూ హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అభివృద్ధి చేయడం కోసం పాలకవర్గ సమావేశంలో పలు అంశాలను చర్చించి నూతన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 3 కార్యదర్శి పుష్పలత, సిబ్బంది మాధురి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ స్మశాన వాటికలో మరుగుదోడ్ల నిర్మాణం

-స్మశాన వాటికలో మౌలిక వసతులు

ప్రారంభోత్సవంలో పాల్గొన్న యెగ్గె మల్లేశం, చెరుకు ప్రశాంత్‌కుమార్‌గౌడ్, గ్రామపెద్దలు

ఎల్.బి.నగర్, మే 26 ప్రభాతవార్త:
స్మశానవాటిక వద్దకు వచ్చే వారి సౌలభ్యం కోసం మరుగుదిడ్లను ఏర్పాటు చేయడం అభినందనీయం అని మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశంకురుమ పేర్కొన్నారు. నాగోల్ గ్రామ స్మశానవాటికలో చెర్కు ఎల్లమ్మ, శంకరయ్యగౌడ్ గారి ఆశీస్సులతో చెర్కు విఠలయ్యగౌడ్, చెర్కు జంగయ్యగౌడ్, చెర్కు భాస్కర్‌గౌడ్‌ల స్మారకార్థంగా నిర్మించిన మరుగుదిడ్ల ప్రాంగణాన్ని యెగ్గె మల్లేశంకురుమ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యెగ్గె మల్లేశం మాట్లాడుతూ సమాజసేవా దృక్పథంతో స్మశానవాటికలో మరుగుదిడ్ల నిర్మాణానికి దాతగా వ్యవహరించిన చెర్కు ప్రవీణ్‌కుమార్‌గౌడ్‌ను అభినందించారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. స్మశానవాటిక మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య, నాగోల్ సుధాకర్ చారి, పల్లె సీతారాములుగౌడ్, ఇంద్రాల రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెర్కు ప్రశాంత్‌కుమార్‌గౌడ్, అనంతుల రాజారెడ్డి, అనంతుల వీరారెడ్డి, తుర్పాటి చిరంజీవి, చెర్కు భవాని గౌడ్, బద్దం ధనుంజయగౌడ్, చెర్కు చిరంజీవిగౌడ్, జి.సతీష్ యాదవ్, నాగోల్ గీతకార్మికుల అధ్యక్షులు చెర్కు శ్రీనివాస్‌గౌడ్, రావుల రాజుగౌడ్, కందికంటి యెట్టేష్‌గౌడ్, బద్దం కుమార్‌గౌడ్, చెర్కు కుటుంబ సభ్యులు, నాగోల్ స్మశానవాటిక కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ల చేతగానితనం వల్లే చెరువుల అభివృద్ధి ఆగింది : బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

కాంగ్రెస్ బృందంతో కలిసి అల్మాస్‌గూడ చెరువులను పరిశీలిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:
అల్మాస్‌గూడలో బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ల చేతగానితనం వల్లే చెరువుల అభివృద్ధి ఆగిందని స్థానిక కాంగ్రెస్ నాయకుడు, ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆరోపించారు. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు పోచమ్మకుంటపై లైటింగ్ డ్రామాలు ఆడారని ఆయన ధ్వజమెత్తారు. అల్మాస్‌గూడకు చెందిన కాంగ్రెస్ నేతలైన గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి రాఘవేందర్‌రెడ్డి మంగళవారం పోచమ్మకుంట, కోమటికుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి చెరువుల సుందరీకరణ పనులు ఆగి రెండు సంవత్సరాలు గడుస్తున్న తరుణంలో హఠాత్తుగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్ట్రీట్‌లైట్లను ప్రారంభించడాన్ని తప్పుపట్టారు. చెరువుల్లో డ్రైనేజీ నీరు చేరి పిచ్చిమొక్కలతో నిండి ఉన్నా వాటిని తొలగించక ముందే వీధి దీపాలను ప్రారంభించడాన్ని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కెటిఆర్ దృష్టికి తీసుకెళ్ళి 70 లక్షలు మంజూరు చేయించి ఆగిపోయిన చెరువుల పనులను మొదలుపెట్టామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్గారి శ్రీధర్‌రెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీహిల్స్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తాం : నూతన కమిటీ

శ్రీహిల్స్ కాలనీ సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ

సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త: అల్మాస్‌గూడ శ్రీహిల్స్ కాలనీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం కమిటీ స్పష్టం చేసింది. కాలనీ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలో అధ్యక్షునిగా కొండోజు శ్రీనివాసచారి, కార్యనిర్వాహక అధ్యక్షునిగా కేతావత్ బహుగుణ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఈర్లపల్లి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా జూపల్లి రవీందర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఈరటి యాదయ్య, ఊర వెంకటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేశ్వరం జంగాచారి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకగ్రీవంగా కమిటీని ఎన్నిక చేసిన సమన్వయకర్తలకు, కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధే లక్ష్యంగా కమిటీ ముందుకు పోతుందని వారు స్పష్టం చేశారు. కాలనీలో మౌలిక సదుపాయాల కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

ఔటర్ సర్వీస్ రోడ్డులో ఎయిర్ ఇండియా బస్సులో మంటలు

-ప్రయాణీకులు లేకపోవడంతో తప్పిన పెనుప్రమాదం

పూర్తిగా కాలిపోయిన బస్సు

హయత్ నగర్, మే 26 ప్రభాతవార్త :
ఔటర్ సర్వీస్ రోడ్డులో పెద్ద అంబర్ పేట సమీపంలో ఎయిర్ ఇండియా బస్సులో మంటలు చెలరేగి బస్సు పూర్తిగా కాలిపోయింది. వివరాలు... ఎయిర్ ఇండియాకు చెందిన బస్సు సర్వీసింగ్ కోసం మంగళవారం ఉదయం శంషాబాద్ ఏయిర్ పోర్టు నుండి ఆటోనగర్ బయలుదేరింది. సర్వీస్ రోడ్డులో పెద్ద అంబర్ పేట సమ్మీపంలోకి చేరుకోగానే ఆకస్మాత్తుగా పొగలు వచ్చాయి. కొద్ది సేపట్లోనే బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ప్రయాణీకులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. షార్ట్ సార్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు భావిస్తున్నారు.

ఆసుపత్రి నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న సెక్రెటరీ ప్రావీణ్య, కలెక్టర్ నారాయణరెడ్డి

ఎల్.బి.నగర్, మే 26 ప్రభాతవార్త:
ఆసుపత్రి నిర్మాణం పనులు వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సెక్రెటరీ ప్రావీణ్య, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. కొత్తపేటలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంగళవారం వారు సందర్శించి ఎల్ అండ్ టి నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా పనులు చేపట్టాలన్నారు. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు.ఆసుపత్రి నిర్మాణం పనులు చేస్తున్న ఎల్ అండ్ టి కంపెనీ నిర్వాహకులతో కలెక్టర్ పలు అంశాల గురించి చర్చించారు. ఆస్పత్రి ఆవరణలో రోగుల కోసం వచ్చే వారికోసం విశ్రాంతి గదులు, అదేవిధంగా దేవాలయం, మసీదు నిర్మాణం పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ కు సంబంధించి కావాల్సిన స్థలం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వికాస్ మహతో, ఆర్ అండ్ బి సెక్రటరీ ప్రవీణ, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి , రెవెన్యూ అధికారులు, ఎల్ అండ్ టి కంపెనీ నిర్వాహకులు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను కార్యాలయాలకు రాకుండానే చెల్లించవచ్చు : డీఈ జాన్

హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త
వినియోగదారులు నెలవారి బిల్లులను ఈ క్రింది మాధ్యమాల ద్వారా కార్యాలయాలకు రాకుండానే చెల్లించవచ్చని మేడ్చల్ డీఈ జాన్ తెలిపారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులను మరింత సులభతరం చేసేందుకు అందుబాటులోనికి తీసుకొచ్చిన మొబైల్ యాప్‌ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు డీఈ జాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల చెల్లింపులను మరింత సులభతరం చేసేందుకు అందుబాటులోకి తీసుకొచ్చిన మొబైల్ యాప్‌ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఫోన్ పే, పేటిఎం గూగుల్ పే, అమేజాన్ పే వంటి యాప్‌లతో పాటు, టిజిఎస్‌పిడిసిఎల్ వంటి మొబైల్ యాప్ ద్వారా కూడా ఇం టి వద్ద నుంచే వేగంగా, సురక్షి తంగా విద్యుత్ బిల్లులు చెల్లించే సౌక ర్యం ఈ యాప్ ద్వారా లభిస్తోందని తెలిపారు.ఈ యాప్ గురించి ప్రతి ఒక్కరూ తమ స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులతో పాటు స్థానిక వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల్లో షేర్ చేసి మరింత మందికి చేరేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, వ్యాపార వర్గాల్లో కూడా ఈ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.డిజిటల్ సేవలను ప్రోత్సహించే దిశగా ప్రజలు ముందుకు వచ్చి ఈ యాప్‌ను వినియోగించడంతో పాటు ఇతరులకు కూడా తెలియజేయాలని డీఈ జాన్ కోరారు.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా క్యారగారి శ్రీధర్

ఉత్తర్వులు అందుకుంటున్న క్యారగారి శ్రీధర్

సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:
రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం నూతన చైర్మన్‌గా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బాలాపూర్‌కు చెందిన క్యారగారి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను ఆయన ఏఐసిసి ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ రాజేంద్రపాల్ గౌతం, కో-ఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ఛైర్మన్ సత్యనారాయణల చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ బలోపేతా నికి ఎస్సీ సెల్ తరపున శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రూ.80లక్షలతో ఉప్పల్ స్టేడియం అభివృద్ధి : ఇర్షాద్‌ఖాన్

ఉప్పల్ స్టేడియంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత ఇర్షాద్‌ఖాన్ తదితరులు

ఉప్పల్, మే 26 ప్రభాతవార్త :
ఉప్పల్ మున్సిపల్ స్టేడియంతోపాటు, ఇండోర్ స్టేడియం అభివృద్ధికి ప్రభుత్వం రూ.80లక్షలు మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ నేత ఇర్షాద్‌ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. స్టేడియంలో సమస్యలపై గతంలో తాను పరిశీలించి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకుని వచ్చానని, దీనిపై స్పందించి ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారని తెలిపారు. ఉప్పల్ ఇండోర్ స్టేడియంతోపాటు, మున్సిపల్ స్టేడియంలో అధునాతన హంగులతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. స్టేడియం అభివృద్ధి పనులు పూర్తయ్యాక యువత మరియు క్రీడాకారులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి కార్మికులను పర్మినెంట్ చేయాలి : సిఐటియు

ఉప్పల్‌లో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నేత జె.వెంకన్న తదితరులు

ఉప్పల్, మే 26 ప్రభాతవార్త :
జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూన్ 8న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జరిగే ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న కోరారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ కళ్యాణపురి, బీరప్పగడ్డ ప్రాంతాలలో జిహెచ్ఎంసి కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటియు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న, నాయకులు పి.రాజు మాట్లాడుతూ జిహెచ్ఎంసి కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన యువకుల అరెస్ట్

ఉప్పల్, మే 26 ప్రభాతవార్త :
బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న పలువురు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ పిఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడంతోపాటు, అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా దుకాణాలు తెరిచి ఉంచిన పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సుమారు 32 మందిని పట్టుకున్నామని, వారికి కోర్టు జరిమానా విధించిందని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పహాడీషరీఫ్ డివిజన్‌లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త:
మహేశ్వరం నియో జకవర్గం జల్‌పల్లి సర్కిల్‌లోని పహాడీ షరీఫ్ డివిజన్ లో మంగళశారం ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి లబ్ధిదారులకు హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు షేక్ యూసుఫ్ ఖాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో అఫ్జల్, భూపాల్‌రెడ్డి, ఫాజిల్ ఖాద్రి, భాను, వసీం, రజనీ కాంత్‌గౌడ్, నిసార్ హసన్, ఒమర్, హబీబ్ పాల్గొన్నారు.

ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో తాగునీటి సమస్యలు తీర్చాలి : ముఖేష్ ముదిరాజ్

జలమండలి కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న మీర్‌పేట్ సెక్టార్ బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్

సరూర్‌నగర్, మే 26 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చే మీర్‌పేట్ డివిజన్‌లోని ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని మీర్‌పేట్ సెక్టార్ బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన పలువురు బిజెపి సీనియర్ నాయకులతో కలిసి మెట్రో వాటర్ వర్క్స్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీకి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్లు డ్యామేజ్ అయ్యాయనీ దీంతో స్థానికులకు మూడు రోజులకు ఒక సారి నీరు సరఫరా అవుతుందని తెలిపారు. దీంతో కాలనీవాసులకు నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో డామేజ్ అయిన పైపుల సమస్యను పరిష్కరించి కాలనీకి రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని ముఖేష్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గాజుల మధు, కాశీరాం యాదవ్, జగన్ ముదిరాజ్‌తో పాటు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష

నిందితుడిని అదుపులోకి తీసుకున్న మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ, ఎస్ఐ తేజ్యా నాయక్

మలక్ పేట, మే 26, ప్రభాతవార్త:
మహిళాతో అసభ్యంగా ప్రవర్తించి ఆమెను దూషించిన వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్షను కోర్టు విధించింది. దీనికి సంబంధించిన వివరాలను మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహం తెలియజేశారు. ముసారాంబాగ్ శాలివాహన నగర్ కు చెందిన ఎన్. సూధిర్ కుమార్ (24) అనే వ్యక్తి ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి దుర్భాషలాడుతూ బహిరంగంగా అల్లరి (న్యూసెన్స్) సృష్టించిన నిందితుడికి గౌరవ న్యాయస్థానం 5 రోజుల జైలు శిక్ష విధించింది.ముసారాంబాగ్ శాలివాహన నగర్ కు చెందిన ప్రసాద్ కుమారుడు ఎన్. సుధీర్ కుమార్ (24) అనే వ్యక్తి బహిరంగ ప్రదేశంలో ఒక మహిళ పట్ల అత్యంత అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు, దుర్భాషలాడుతూ తీవ్ర అలజడి సృష్టిం చాడు. దీంతో మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. తేజ్యా నాయక్ నిందితుడిపై సిటీ పోలీస్ చట్టంలోని సెక్షన్ 70సి కింద ఈపెట్టీ కేసు నమోదు చేసి ఏడవ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎమ్. భాస్కర్ ముందు హాజరుపరిచారు. నిందితుడిపై మోపబడిన నేరం రుజువు కావడంతో, మేజిస్ట్రేట్ నిందితుడు ఎన్. సుధీర్ కుమార్‌కు 5 రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందని మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ సమాజంలో అల్లరి సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.